ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-3-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 53 పేజీలు: 12 వెల: 6.50

కాలుష్య దేశాల్లో పాక్ -1
ఆరో స్థానంలో భారత్
9లో
50 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వు ఇంధనం సిద్ధం: ప్రధాని

యుద్ధ విరమణకు పాక్ ఆర్మీ చీఫ్ మధ్యవర్తిత్వం
అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇతర ఉన్నతాధికారులతో మునీర్ చర్చలు

అమెరికా నిలిపివేసినా మేం దాడులు ఆపం: ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

యుద్ధ చట్టాలను ఉల్లంఘించిన ఇరాన్: హ్యూమన్ రైట్స్ వాచ్

9



# హార్ముజ్‌ను తక్షణమే తెరవాలి..
## యుద్ధానికి భారత్ వ్యతిరేకం
### శాంతియుత చర్చలతోనే పరిష్కారం
మూడు దేశాలు చర్చల ద్వారానే విభేదాలు పరిష్కరించుకోవాలి
ట్రంప్‌తో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ

**న్యూఢిల్లీ, మార్చి 24:** పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలిక బ్రేక్ పడిన తర్వాత తొలిసారిగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రధాని మోడీతో టెలిఫోన్‌లో >>2





# మతం మారితే ఎస్సీ హోదా కట్
## రిజర్వేషన్ ప్రయోజనాలు వర్తించవు..
సుప్రీంకోర్టు సంచలన తీర్పు
ఎపి హైకోర్టు తీర్పునకు సమర్థన

**విజయవాడ,మార్చి 24,ప్రభాతవార్తప్రతినిధి:** షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) లేదా షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) చెందిన వారు క్రైస్తవం, ఇస్లాం వంటి ఇతర మతాల్లోకి మారితే, వారికి రాజ్యాంగబద్ధంగా లభించే కుల హోదా, రిజర్వేషన్ ప్రయోజనాలు వర్తించవని సుప్రీం కోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన వారి ఎస్సీ హోదాకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో పలు విషయాలు ప్రస్తావించింది. క్రిస్టియన్ మతంలోకి మారాక ఎస్సీ హోదా ఉండదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు కాకుండా ఇతర మతాల్లోకి మారితే ఎస్సీ హోదా వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. ఈ వ్యవహా >>2

# ఇంటింటికి సురక్షిత నీరు

హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా ప్రతిపల్లెకు, ప్రతి ఇంటికి పరిశుభ్రజలం

డ్వాక్రా సభ్యులకు నీటి నాణ్యత పరీక్ష బాధ్యత

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన ఎంఒయు, కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి24,ప్రభాతవార్తప్రతినిధి:** హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పల్లెకు, ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని నిరంతరాయంగా అందించే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జల్ జీవన్ మిషన్ 2.0కింద 2028నాటికి రాష్ట్రంలోని ప్రతిఇంటికీ తాగునీటి కుళాయి లక్ష్యాన్ని సాకారం చేస్తామని ఆయన వెల్లడించారు. మంగళవారం జల్‌జీవన్ మిషన్ 2.0పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఢిల్లీలో కుదిరిన ఎంఒయు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ ఆపరేషన్, మెయింటెనెన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించి 2025 సెప్టెంబర్‌లోనే సమగ్ర విధానాన్ని ప్రకటించినట్టు గుర్తు చేశారు. తాగునీటి సరఫరా వ్యవస్థల నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జల్ జీవన్ మిషన్ అమలు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. జల్ జీవన్ మిషన్ 2028 వరకు కొనసాగిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనికి కేంద్రం సహకరించాలని ఈ సందర్భంగా సీఆర్ పాటిల్‌ను సీఎం కోరారు. అందుకు ఆయన సుముఖతను వ్యక్తం చేసారు. వర్చువల్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ జల్ జీవన్ మిషన్ కార్యక్రమం మొదటి దశలో 16 కోట్ల మంది గృహాలకు కుళాయిలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ప్రాజెక్టులో జరిగిన కొన్ని లోపాలను సవరించి నిర్వహణ చేపడుతున్నారంటే సంతోషమన్నారు. మరో 3కోట్ల ఇళ్లకు సురక్షితమైన మంచి నీటిని అందించాల్సి ఉంది. ఏపీలో నీటి నాణ్యతను పరీక్షించేందుకు డ్వాక్రా మహిళల సేవల్ని వినియోగించుకోవాలనుకుంటున్నామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా వివిధ ప్రాంతాల్లో 9కోట్ల మంది మహిళలకు దూరం నుంచి నీరు తెచ్చుకునే కష్టాలు తప్పుతాయన్నారు. జేజెఎం 2.0 ద్వారా ఏపీలో ప్రతీ ఇంటికి కుళాయి అనే లక్ష్యం నెరవేరుతుందని ఆశిస్తున్నానన్నారు. ఈ విషయంలో కేంద్ర సహకారం మరువలేనిదన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే ప్రతీ ఇంటికీ సురక్షిత మంచి నీరు చేరటం ముఖ్యంఅన్నారు. సాగు కోసం కూడా రైతులకు >>2



మంగళవారం న్యూఢిల్లీలో జల్ జీవన్ మిషన్ 2.0పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన ఎంఒయు కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు



# జూన్‌లోగా 'వెలిగొండ' పనులు పూర్తి
## మంత్రి నిమ్మల

**విజయవాడ, మార్చి 24,ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంత కీలకమైన ఇరిగేషన్ రంగానికి సంబంధించి పనులు శరవేగంతో పూర్తి చేసి ఫలితాలు ప్రజలకు అందివ్వాలని కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తోందని జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. అందులో భాగంగానే ప్రతి పనికి, ప్రతి ప్రాజెక్టుకి గడువు నిర్దేశించుకున్నామన్నారు. ఆలోపు పనులు పూర్తి చేయాలని లక్ష్యాలు విధించామన్నారు. ఇందుకు సర్వహంగులు ఒడ్డుతున్నామన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు కూడా పదే,పదే చెబుతున్నామని ఆయన చెప్పారు. అయితే ఆచరించాల్సిన అధికార యంత్రాంగం, మంగళవారం >>2



మంగళవారం డిజిపి సహా పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమైన సిఎం చంద్రబాబు

# అమరావతిలో నిప్పుపై నిగ్గు తేల్చండి
## ప్రమాద ఘటనలు, కుట్ర కోణంపై తక్షణమే నివేదిక ఇవ్వాలని సిఎం చంద్రబాబు ఆదేశం

**విజయవాడ,మార్చి 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో నిప్పుపై నిగ్గు తేల్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాయపూడి వద్ద అగ్ని ప్రమాద ఘటనపై ఆయన అసహనం వ్యక్తం చేసారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాద ఘటనలు నిజంగా ప్రమాదాలా, లేక దాని వెనుక కుట్ర కోణం ఉందా అనేది వెలికి తీయాలని సిఎం వ్యాఖ్యానించారు. వరుస ఘటనలు, అవి జరుగుతున్న తీరు చూస్తుంటే కుట్ర కోణం ఉందనే అనుమానం వస్తోందన్నారు. ఆ దిశగా మరింత లోతుగా అన్నికోణాల్లోనూ విచారణ జరపాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. గతంలో జరిగిన కొన్ని ఘటనలు, ఇప్పుడు రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని కుట్రకోణం ఉందా అనే విషయం కూడా విశ్లేషించి వాస్తవాలు బయటకు తీయాలన్నారు. రాయపూడిలో హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం వద్ద నిర్మాణ సంస్థకు >>2

# రాష్ట్రంలో 150 ఆయుష్ కేంద్రాలు
## రెండు నెలల్లో ప్రారంభానికి సిద్ధం
కూటమి ప్రభుత్వ చొరవతో ప్రాచీన వైద్య విధానం: మంత్రి సత్యకుమార్



**విజయవాడ.మార్చి24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పూర్తిగా నిరక్ష్యానికి గురైన భారతీయ ప్రాచీన వైద్య సేవల్ని ప్రజలకు చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో అందులో భాగంగానే 150 ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను ప్రారంభించామని వివరించారు. రూ.44 కోట్లతో చేపట్టే ఈ భవనాల నిర్మాణాలు, ఆధునీకీకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రెండు నెలల్లోగా పూర్తి చేసి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి) చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా ఒకేసారి భారీ ఎత్తున మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఉపక్రమించింది. నేషనల్ ఆయుష్ మిషన్ (వితిలీ) 202526 వార్షిక ప్రణాళికలో భాగంగా మొత్తం 150 ఆయుష్ కేంద్రాల నూతన భవన నిర్మాణాలు మరియు ఆధునీకీకరణ పనులకు ఆయుష్ శాఖ నిధులు మంజూరు చేసింది. కొన్ని ఆయుష్ ఆరోగ్య కేంద్రాలు శిధిలావస్థకు చేరుకోగా, మరి కొన్ని అరకొర సౌకర్యాలతో ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. ప్రాచీన వైద్య విధానాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిరక్ష్యం చేయడంతో ఈ దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆయుష్ వైద్యశాలల రూపురేఖలు మారనున్నాయి. ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణాలు, ఆధునీకీకరణ పనులు జరుగుతున్నాయి. 90 ఆయుష్ కేంద్రాలకు ఆధునీకీకరణ పనులు చేపట్టగా, 60 ప్రభుత్వాసుపత్రుల్లో నూతనంగా ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పిహెచ్‌సిలు)26, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో(సిహెచ్‌సిలు) 26, జిల్లా ఆసుపత్రుల్లో 8 ఆయుష్ ఆరోగ్యకేంద్రాల్ని నూతనంగా నిర్మిస్తున్నారు. 50శాతం మేర పనులు పూర్తి కాగా రెండు నెలల్లోగా మిగతా >>2

# విద్యుత్ సంస్థల రుణాలు తీరేలా ప్రణాళిక
## ఆవిష్కరణల కోసం ఇంక్యుబేషన్ ఫండ్: సిఎం చంద్రబాబు

**విజయవాడ, మార్చి 24,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ కొనుగోలు ఛార్జీలను తగ్గించే అంశంపై అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇప్పటికే ఈ దిశగా చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరం చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్ కు రూ. 4కు తగ్గించటంతో పాటు ప్రజలపై భారం వేయకుండా విద్యుత్ సంస్థల రుణాలు తీర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో జరిగిన విద్యుత్ శాఖ సమీక్షలో సీఎం కీలక సూచనలు చేశారు. 2028-29 నాటికి విద్యుత్ కొనుగోళ్ల ఖర్చును తగ్గించేందుకు చేపట్టిన ప్రణాళికలను విద్యుత్ శాఖ అధికారులు సీఎం చంద్రబాబు ముందుంచారు. విద్యుత్ రంగంలోని వివిధ విభాగాల ద్వారా సంస్కరణలు చేపడితే మొత్తంగా యూనిట్ కు రూ.1.32 చొప్పున విద్యుత్ కొనుగోలు భారాన్ని తగ్గించవచ్చని సీఎంకు వివరించారు. 202829 నాటికి యూనిట్ కొనుగోలు ధరను రూ.4.10కు తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. రూ.4కు ఈ కొనుగోలు ధరను తగ్గించేలా చూడాలని సీఎం ఆదేశించారు. నూతన టెక్నాలజీని, ఇన్నోవేషన్లను వినియోగించుకుని విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. విద్యుత్ సంస్థల సమర్థ నిర్వహణతో 202526 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.339 కోట్ల మేర ఆదా చేశామని, ఈ తరహా పొదుపు చర్యలను మరింతగా తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి >>2



>>2

# కృష్ణపై మరో భారీ బ్రిడ్జి
## అమరావతికి రైలు మార్గంలో ముందడుగు
### రూ.565.83 కోట్లతో నిర్మాణం

**రాజంపేట, మార్చి24 ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని అమరావతి రైల్వే కనెక్టివిటీ ప్రాజెక్టులో అతిముఖ్యమైన పనుల నిర్మాణానికి ముందడుగు పడింది. ఎర్రుపాలెంనుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించే కొత్త రైలుమార్గంలో కృష్ణానదిపై >>2

# ఆర్డీటి రెన్యువల్ ఘనత మంత్రి లోకేష్‌దే



సంస్థ విదేశీ నిధుల సమీకరణ గతంలో నిలిపేసిన కేంద్రం
లోకేష్ దృష్టికి తీసుకెళ్లగానే సమస్యకు పరిష్కారమైందంటూ హర్షం
ఆర్డీటి భూములపై గతంలో వైసిపి కన్ను
గత ప్రభుత్వ కుట్రపై ఆనాడే ఉద్యమించిన టిడిపి : మంత్రి సవిత

**సచివాలయం,మార్చి 24,ప్రభాతవార్త :** అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటి) సంస్థకు నిధుల సమీకరణకు విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఏ)ను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించడంపై రాష్ట్ర బిసి,ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,చేనేత,జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. ఈ ఘనత ముమ్మాటికి సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్ దే నని కొనియాడారు. వారికి రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్డీటీ భూములు కొట్టేయాలని చూస్తే,ఆనాటి ప్రతిపక్షంలో ఉన్న తాము ఆ సంస్థకు అండగా నిలిచా మన్నారు. ఆర్డీటీ ఎఫ్.సి.ఆర్.ఏను కేంద్రం నిలిపివేసిన జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఇచ్చిన హామీకి కట్టుబడుతూ కేంద్రాన్ని ఒప్పించి కూటమి ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్.సి.ఆర్.ఏను పునరుద్దరించిందన్నారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. రాయలసీమ గడ్డపై >>2

# లిక్కర్ కేసు అనిల్ చోక్రాకు బెయిల్

**విజయవాడ,మార్చి 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సంచలన సృష్టించిన లిక్కరు స్కామ్‌లో కీలక నిందితుల్లో ఒకడైన అనిల్ చోక్రాకు బెయిల్ లభించింది. ఈ కేసులో చోక్రాకు విజయవాడ ఏసీబీ కోర్టు షరతుల కూడిన బెయిల్ మంజూరు చేసింది. చోక్రా ప్రస్తుతం సబ్‌జైలు రిమాండ్‌లో ఉన్నారు. గతంలో అతని పలు మార్లు ఈ కేసులో బెయిల్‌కు ప్రయత్నించి విఫల మయ్యాడు. అనిల్ చోక్రాను వెంటనే జైలు నుంచి విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

వార్త

పాఠకుల తక్కువ సమయం తీసుకుని ఎక్కువ విజ్ఞానం అందించే రచయితే ప్రతిభావంతుడు.

- సి.సి.కోల్టన్

# 'ఆనందం' కొంచెమే!

ఆనందపరవశం అంటే శరీరంలోని నవనాడులు ఉత్తేజపడి సంతోషదాయక భావనలు వెల్లివిరిస్తే ఆ జీవితానికి అంతకంటే కావాల్సిందేముంది. అందుకే మానవాళిలో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండే రోజు కోసం, క్షణం కోసం తపన పడుతుండటం సహజం. ఇదే సూత్రాన్ని అన్నిదేశాలకు వర్తింపచేస్తూ ఐక్యరాజ్యసమితి సంవత్సరానికి ప్రత్యేకించి ఒక రోజును దానికోసమే కేటాయించింది. అంటే ఏదో పండుగ రోజులలో ఉండేటట్లు అన్ని రోజులూ నిత్య వసంతం కావాలనుకోవడం ఎవరికైనా తప్పదు. కానీ ఏదో ఐక్యరాజ్య సమితి చెప్పింది కదా అని ఆ ఒక్కరోజుకే సంతోషం పరిమితం అంటే అది జరగని పని. ఏరోజున ఎవరు ఆనందంగా ఉంటారో, ఎవరు కష్టాలు ఎదుర్కొంటారో చెప్పలేం. అది సాధ్యమయ్యే పని కూడా కాదు. అందుకే ఏడాది పొడుగునా ఆ దేశ కాల మాన పరిస్థితుల రీత్యా ఆనంద జీవితం గడుపుతున్నారో లేదో వివిధ మార్గదర్శకాలకు, ప్రామాణికాలకు లోబడి ప్రశాంతంగా, సంతోషంగా ఉంటున్నారో లేదో పరిగణనలోకి తీసుకుని ఆయా దేశాలకు ర్యాంకులను ఇవ్వడం ఆనవాయితీ. ఈసారి కూడా ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి పరిష్కారాల నెట్‌వర్క్ ఈ ర్యాంకుల జాబితాను విడుదల చేసింది. అందులో తాజాగా ప్రపంచంలో ఫిన్లాండ్ ఎప్పటిలానే అత్యంత సంతోషకరమైన దేశంగా రాజిల్లింది. వరుసగా తొమ్మిదోసారి ఈ దేశం అగ్రస్థానంలో నిలబడింది. భారత్ 116వ స్థానంలోకి చేరుకుంది. గత ఏడాది ఎంపికలో భారత్ 118వ స్థానంలో ఉండేది. 2024లో పొందిన ర్యాంకు 118 కన్నా కాస్త మెరుగైన స్థితిలోనే ఉంది. అంటే ఇప్పుడు రెండు స్థానాలకు ఎగబాకిందని చెప్పుకోవాలి. ఈ నెల20న అంతర్జాతీయ ఆనంద దినోత్సవం సందర్భంగా ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని వెల్‌బీయింగ్ రీసెర్చ్ సెంటర్ ఇటీవల వార్షిక నివేదిక వివిధ దేశాల స్థాయిల గురించి వివరించింది. ఫిన్లాండ్‌కే ఈ ఘనత దక్కిందని చూస్తే మంచి విశ్లేషణలు అందుబాటులోకి వచ్చాయి. యువతపై ముఖ్యంగా పశ్చిమ ఐరోపా, పాశ్చాత్య దేశాల్లోని బాలికలపై సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం ఆందోళనకరంగా ఉందని నొక్కి చెప్పింది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్లలో 25 ఏళ్లలోపు వారి జీవన విధానం అస్థిరంగా ఉందని, సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి గడపడమే ఈధోరణికి కారణమని వెల్లడించింది. నివేదిక ప్రకారం నార్డిక్ దేశాలైన డెన్మార్క్, ఐస్‌ల్యాండ్, స్వీడన్, నార్వేలు కూడా మొదటి 10 దేశాల్లో స్థానం సంపాదించాయి. 2023లో 23వ స్థానంలో ఉన్న కోస్టారికా ఈ ఏడాది నాలుగో స్థానానికి ఎగబాకింది. ఈ దేశ ప్రజల సామాజిక జీవిత ప్రమాణాలు, వాటి నాణ్యత, ప్రస్తుత స్థిరత్వంతోనే అత్యంత సంతోషకర జాబితాలో స్థానం సంపాదించాయని వెల్ బీయింగ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ జాన్ ఇమాన్యుయేల్ పేర్కొన్నారు. అమెరికా ఈ జాబితాలో 23వ స్థానాన్ని పొందింది. కెనడా 25, బ్రిటన్ 23వ స్థానాల్లో నిలిచాయి. సంక్షోభం ఎదుర్కొంటున్న అఫ్ఘానిస్థాన్ ఈ ఏడాది కూడా అత్యంత అసంతృప్తికర దేశంగా నిలిచింది. తర్వాతి స్థానాల్లో ఆఫ్రికాలోని సియెర్రా లియోన్, మలావి ఉన్నాయి. అత్యంత సంతోషకర దేశాల జాబితాలోని భారత్‌లో అవినీతి, దాతృత్వం, స్వేచ్ఛ, తలసరి ఆదాయం, ఆరోగ్యకర జీవనం వంటి విభాగాల వారీగా విడివిడిగా చూసినప్పుడు ఈ ఏడాది స్థాయిలు చాలా మెరుగయ్యాయి. సంతోషకర దేశాల జాబితాలో నేపాల్ 99వ స్థానంలో, పాకిస్థాన్ 104వ స్థానంలో ఉండటం గమనార్హం. సంతోషానికి ప్రాధాన్యతనివ్వని జీవి అంటూ ఈ భూమ్మీద ఏదీ ఉండదు. జీవితాన్ని సంతోషపరంగా నందనవనం చేసుకోగలిగినవారే ధన్యత నొందిన వారిలో జమ. అలాగే ప్రజా శ్రేయస్సు కోసం ప్రపంచ దేశాలను చైతన్యపరచడమే ప్రధాన ఉద్దేశం. తొలి రోజుల్లో సుఖమయ జీవితమే పరమానందం అనే భావనను కలుగ చేసిన దేశం ఏదైనా ఉందంటే అది భూటాన్. ఈదినోత్సవం ప్రాముఖ్యతను ప్రజల్లో ఇలాంటి భావనను చైతన్యపరిచేలా ప్రభుత్వాలు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు అందరూ భాగస్వాములు కావాలని ఐక్యరాజ్యసమితి పిలుపుతో జనం సంఘటితమైనారని చెబుతున్నారు. సంతోషానికి సంబంధించి, భారత్ కంటే మన పొరుగు దేశాలైన శ్రీలంక, పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లో కూడా ప్రజలు మనకంటే సంతోషంగా జీవిస్తున్నట్లు రిపోర్ట్ పేర్కొంది. ఫిన్‌ల్యాండ్, డెన్మార్క్, స్విట్జర్లాండ్, ఐస్‌లాండ్, నెథర్లాండ్స్ దేశాలు వరుసగా టాప్ 5లో ఉన్నాయి. భారత్ వంటి అత్యధిక జనాభా ఉన్న దేశంలో అసమానతలు, పేదరికం కూడా ఎక్కువే. 161 దేశాలలో మన దేశం అసమానతల సూచీలో 123లో ఉండటం ఇందుకు నిదర్శనం. ధనిక పేదల మధ్య ఎంత వ్యత్యాసం ఉందో తెలుస్తుంది. మనిషి ఎంత సంతోషంగా ఉన్నా, కొన్నికొన్ని సందర్భాలలోఆనందానికి దూరంగా ఉన్న విషయాలు కూడా తలెత్తుతాయి. ఉరుకుల పరుగుల జీవితంలో సగటు నిత్యం పనిలో డబ్బు సంపాదనలో నిమగ్నంకావడం ఒకటైతే సంతోషంగా కుటుంబంతో గడపకపోవడం మరొకటి ఇటీవలఎక్కువైంది. అందుకే కాలగతిలో ప్రతి నిముషం విలువైనదే. మనకున్న కాలాన్ని వ్యర్థం చేసుకోవడమంటే అదికూడా ఒక తప్పిదమే అనుకోవాలి. అందుకే. ప్రతిక్షణాన్ని ఆనందమయం చేసుకునేందుకు ప్రయత్నించాలి. మనతోపాటు మన చుట్టూ పక్కల వారు కూడా ఆనందంగా ఉండడం అవసరమేమో! పేదరిక నిర్మూలన, అసమానతల తగ్గింపు, పర్యావరణ పరిరక్షణ అంశాల ప్రాతిపదికగా ముందుకు సాగితే సమాజం మొత్తం సంతోషదాయకమే!

ప్రపంచపు నైతిక స్పృహను సమీకరించుకోగలిగితే, గొప్ప సైన్యానికి మించిన శక్తి మనకి లభిస్తుంది.



ఉడ్రోవిల్సన్

ఇంద్రియ పరమైన విషయాలతో ఎంతగా మనిషి తెగతెంపులు చేసుకుంటాడో, అంతగా అతడు భగవంతుని పట్ల ఆకర్షితుడవుతాడు.



రమణ మహర్షి

## ప్రజావాక్కు



### రైతన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

దేశంలోఉన్న అందరూ వ్యక్తులలో అత్యంత ఆరోగ్యవంతంగా ఉండే వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది కేవలం రైతన్న మాత్రమే. తాను నిరంతరం ప్రతి రోజు రకరకాల పనులు చేయడం వలన శరీరం లోని అన్ని భాగాలకు పని చేయడం కల్పించడం వల్లఆరోగ్యకరంగా ఉంటాడు. మిగతా వ్యక్తులు ఏదోఒక అనారోగ్యసమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటారు. ఒక గిట్టుబాటు ధర రైతన్నకు అనుకూలంగా ఉంటే ఇక రైతురాజు అయినట్టే. ఆ గిట్టుబాటు ధర వస్తుందో లేదో చూడాలి మరి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిదాదాపు రెండుసంవత్సరాలు దాటిన నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు. ఉద్యోగ నోటిఫికేషన్ మాటనే చెప్పుటలేదు. ఉద్యోగాలు ఇస్తుందని నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీపడుతున్నారు. ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతూ ఆత్మహత్యలు చేసుకుంటూ నిరాశ నిస్పృహలోకి వెళ్తున్నారు. నోటిఫికేషన్ ఇవ్వాలని పోరాడిన వారిపై అక్రమకేసులు పెడుతున్నారు. నిరుద్యోగ యువతను ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని గమనించాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రలు ఇచ్చి డెబ్బై వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు చెబుతున్నారు.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### భూమి కబ్జాలను ఆపాలి

రెవిన్యూ కార్యాలయంలో ప్రతి భూమి సర్వేనంబర్, విస్తీర్ణం, మ్యాపులు ఉండాలి. ప్రభుత్వం ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కాలనీ వివరాలు అన్ని ఉండాలి. కానీ వరంగల్ జిల్లాలో భూమి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు ఎక్కువగాజరుగుతున్నాయి. రెవిన్యూఅధికారులు ప్రభుత్వ భూమిని కబ్జాలు చేసిన వారిని, అక్రమ నిర్మాణం చేసిన వారిని పట్టించుకోవడం లేదు. రెవిన్యూ అధికారులు రికార్డులులేవు అంటున్నారు. భూమికబ్జాలకురాజకీయ జోక్యం తోడుగా ఉంటుంది. అధికారులు రికార్డులులేవు అని సాకులు చెప్పి రోజులు నెలలు సంవత్సరాలు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనితో భూమి కబ్జాలు ఎక్కువ అవుతున్నాయి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

### ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం

డిజిటల్ యుగంలో సమాచార సాంకేతికత ప్రజల జీవితంలో కీలక భాగంగా మారింది. బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, డిజిటల్ చెల్లింపులు వంటి కార్యకలాపాలు రోజువారీ జీవితంలో సాధారణమయ్యాయి. అయితే ఈ సౌకర్యాలతో పాటు సైబర్ మోసాల సమస్య కూడా దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతోంది. మోసగాళ్లతప్పుడుసందేశాలు, నకిలీ వెబ్‌సైట్లు, పెట్టుబడివాగ్దానాలు, తప్పుడు కాల్‌లద్వారా ప్రజలను మోసం చేసి భారీ మొత్తాలను దోచుకుంటున్నారు. ఇటీవలి కాలంలో బ్యాంకుఖాతా వివరాలు అడగడం, తప్పుడు లింకులు పంపించడం, పెట్టుబడుల పేరుతో అధిక లాభాల ప్రలోభాలు చూపించడం వంటి పద్ధతులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తెలియకపోవడం లేదా అప్రమత్తత లేకపోవడం వల్ల చాలామంది ఈ మోసాలకు బలవుతున్నారు. ఫలితంగా వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కూరగాయల ఉత్పత్తి చేపట్టాలి

ఆస్తులసృష్టిని ఆధారంగా చేసుకొని ఇక ఉపాధిహామీ పనులు ఉండబోతున్నాయి. ఇది ఒక విధంగా మంచిదే అయితే తీరు మారుతున్న లేదారూపుమారుతున్న ఉపాధిలో ఏమి ఉండాలన్నదే అసలు ప్రశ్న. ఇంకొకవైపు వాటర్ షెడ్ కలగొలుపుగా ఉపాధి పనులు ఉండనున్న నేపథ్యంలో తెలంగాణ లాంటి రాష్ట్రాలు ఫారం పొండ్ల పైన దృష్టిసారించాలి. దీనివల్ల ప్రజలకు అదనపు ఆదాయం సమాకురడంతో పాటు ఉపరితల నీటి మట్టం కూడా పెరిగే అవకాశం ఉంది. కావున నీటి కుంటాలతో పాటు కూరగాయ పందిల్లు కూడా అవకాశం కల్పిస్తే తెలంగాణ లాంటి రాష్ట్రాలు కూరగాయల ఉత్పత్తి హబ్‌లుగా మారే అవకాశం ఉంది.

- భారత అవినాష్, జనగాం

### చెత్తతో విద్యుత్ ఉత్పత్తి

తమిళనాడు ప్రభుత్వం ఆరాష్ట్రంలో పేరుకుపోతున్న లక్షల టన్నుల చెత్తను తగలబెట్టకుండా దానినిశాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి సంకల్పించిదని వార్తలో చదవడం జరిగింది. ఇటువంటి పద్ధతి మరీ కొత్త విషయం కాకపోయినా ఈదశగా ప్రయత్నాలు చేయడం లేదు. మన తెలుగురాష్ట్రాలు తమ అధికారులను తమిళనాడుకు పంపి వారు తీసుకున్న సాంకేతికతను తెలుసుకుని మన వాళ్ళు కూడా విద్యుతుత్పత్తి చేస్తే కరెంటు కొరత తగ్గుతుంది.

- ఎన్. లక్ష్మి, సికింద్రాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ప్రమాదాన్ని పసిగట్టే సాంకేతికత అవసరం

**ప్రమాదం జరిగినప్పుడు పరిహారం ప్రకటించడం వల్ల ప్రయోజనం లేదు. భవన నిర్మాణ చట్టాలను శాస్త్రీయంగా సవరించాలి. కేవలం స్థలవిస్తీర్ణాన్ని బట్టి కాకుండా శాస్త్ర, సాంకేతికతను ఆపాదించాలి. గాలి ప్రసరణకు అనుగుణంగా సమూలంగా సవరించాలి. ప్రతి కాలనీలో గాలి ప్రసరణకు అడ్డుపడని కారిడార్లను వదిలేలా చట్టపరమైన, పటిష్టమైన విధానాలను తీసుకురావాలి. గాలి ప్రసరణకు ప్రాధాన్యతనిస్తూ జోనింగ్ నిబంధనలను కఠినతరం చేయాలి. పటిష్టమైన ఫైర్‌సేఫ్టీ ఆడిట్‌లను నిరంతరం నిర్వహించడం, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఇలాంటి విషాదాలను శాశ్వతంగా నివారించగలం. పౌరులలో కూడా భద్రత పట్ల అవగాహన పెరగాలి. మూలాల్లో ఈ మార్పులు రానంతవరకు, ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్స్‌గ్రేషియాలు ప్రకటించడం మినహా మనం చేయగలిగింది ఏమీ ఉండదు.**

డి జె మోహన రావు

దేశ రాజధాని ఢిల్లీలోని పాలం ప్రాంతంలో మార్చి పద్దెనిమిదవ తేదీన జరిగిన అగ్నిప్రమాదం కేవలం ఒక ప్రమాదం మాత్రమే కాదు, అది మన వ్యవస్థాగత లోపాలకు సజీవ సాక్ష్యం. సాధ్ నగర్ మార్కెట్‌లోని ఒక ఐదు అంతస్తుల భవనంలో తెల్లవారుజామున చెలరేగిన మంటలు ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మందిని బలితీసుకోవడం అత్యంత విషాదకరం. అభం శుభం తెలియని ముగ్గురు పసిపిల్లలతో సహా ఆ కుటుంబం నిద్రలోనే అగ్నికి ఆహుతి కావడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ఈ అగ్నిప్రమాదం నాగరిక సమాజం తలదించుకునేలా చేసింది. అగ్నిప్రమాదం కేవలం ఒక యాదృచ్ఛిక ఘటన కాదు, అది ఆధునిక నగరీకరణ సృష్టిస్తున్న ప్రమాదాలకు ఒక సజీవ సాక్ష్యం. మన వ్యవస్థాగత లోపాలను తీవ్రంగా ప్రశ్నిస్తోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుస్తులు, కాస్మెటిక్స్ దుకాణంలో మొదలైన ఒక చిన్న నిప్పు రవ్వ, క్షణాల్లో పైఅంతస్తులకు వ్యాపించి ఆ నివాసాన్ని మృత్యుకుహరంగా మార్చింది. ఈ ఘటనను కేవలం అగ్నిమాపక శాఖ వైఫల్యంగానో, షార్ట్ సర్క్యూట్‌గానో కొట్టిపారేయలేము. దీని వెనుక అత్యంత సంక్లిష్టమైన రసాయన, భౌతిక, ఆర్థిక, పర్యావరణ కారణాలు విశ్లేషిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూస్తాయి. ఒకప్పుడు దుకాణాలలో చెక్కతో, ఇనుముతో తయారు చేసిన వస్తువులు ఉండేవి. ఒక వేళ అగ్నిప్రమాదం జరిగినా అవి నెమ్మదిగా కాలేవి. కానీ నేటి వాణిజ్య సముదాయాలు పూర్తిగా పెట్రోకెమికల్ ఉత్పత్తులతో నిండి ఉంటున్నాయి. పాలం ఘటనలో కిందిఅంతస్తులో ఉన్న పాలిమర్ వస్త్రాలు, పర్ఫ్యూమ్ బాటిళ్లలో ఉండే ఏరోసాల్స్, ఇతర సింథటిక్ రసాయనాలు మంటలకు విపరీతమైన ఇంధనాన్ని అందించాయి. గాలి చొరబడని మూసి ఉన్న భవనాల్లో ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా వందల డిగ్రీలకు చేరినప్పుడు 'ఫ్లాష్ ఓవర్' అనే శాస్త్రీయ ప్రక్రియ జరుగుతుంది. అంటే, ఆ గదిలోని వస్తువులన్నీ ఒకేసారి అంటుకుని పేలిపోతాయి. దీనికితోడు భవనానికి సరైన వెంటిలేషన్ లేకపోవడం వల్ల, ఆ భవనం ఒక పొగగొట్టంలా మారి, కింది నుంచి ఆక్సిజన్‌ను లాక్కుంటూ మంటలను, దట్టమైన విష వాయువులను వేగంగా పై అంతస్తులకు చేరవేసింది. ఈభౌతిక శాస్త్ర సూత్రాలకు, మన నగరాలలోని ఆర్థిక అసమానతలు తోడవడం వల్లే ప్రాణనష్టం ఊహించని స్థాయిలో ఉంటోంది. కింది అంతస్తుల్లో అత్యంత ప్రమాదకరమైన వ్యాపారాలు చేస్తూ, పై అంతస్తుల్లో నివాసం ఉండటం అనేది ఎవరూ ఇష్టపడి చేసే పని కాదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆకాశాన్ని అంటుతున్న రియల్ ఎస్టేట్ ధరలు, అద్దెల కారణంగా చిన్న వ్యాపారులు తమ ఉపాధికి, నివాసానికి వేర్వేరు చోట్ల వెచ్చించలేకపోతున్నారు. ఎక్కడైతే వారి జీవనాధారం ఉందో, కచ్చితంగా అక్కడే నివాసం ఉండటం వారికి ఆర్థికంగా ఒక అనివార్యత. మున్సిపల్ చట్టాలు, జోనింగ్ నిబంధనలు ఈ క్షేత్ర స్థాయి ఆర్థిక వాస్తవాలను పట్టించుకోకుండా, కేవలం కాగితాల మీద కఠిన నిబంధనలు రాయడం వల్లే అవిఎప్పటికీ సరిగ్గా అమలు కావడం లేదు. దీనికితోడు సంబంధింత అధికారుల అవినీతి కారణంగా, కనీస భద్రతా ప్రమాణాలు లేని ఇరుకైన భవనాలకు



సైతం సులభంగా వాణిజ్య అనుమతులు లభిస్తున్నాయి. పర్యావరణం, నగరాల నిర్మాణం కూడా ఈ ప్రమాదాల తీవ్రతను, సహాయక చర్యలకు అడ్డంకులను పెంచుతున్నాయి. కాంక్రీట్ అడవులుగా మారుతున్న నగరాల్లో 'అర్బన్ హీట్ ఐలాండ్' ప్రభావం వల్ల భవనాలు ఎప్పుడూ వేడెక్కి ఉంటున్నాయి. దీనికి తోడు భవనాల మధ్యగాలి ఆడే ఖాళీ స్థలం లేకపోవడం వల్ల, మంటలు వచ్చినప్పుడు ఆ వీధులన్నీ గాలిని లాక్కునే పొగగొట్టాల్లా పనిచేసి మంటలను మరింత ఎగదోస్తున్నాయి. ఆ ఇరుకైన గల్లీల్లో కనీసం గాలి ఆడే అవకాశం కూడా ఉండదు. సరిగ్గా ఇలాంటి ఇరుకైన వీధులే సహాయక చర్యలకు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయి. పాలం ఘటనలో భారీ ఫైర్ ఇంజన్లు, హైడ్రాలిక్ యంత్రాలు ఆ ఇరుకు సందుల్లోకి సకాలంలో వెళ్లలేకపోవడం వల్లే ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కనీసం మంటల నుంచి తప్పించుకోవడానికి ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లాంటి ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడం వల్ల ఆ కుటుంబం లోపలే చిక్కుకుపోయి ఊపిరాడక ప్రాణాలు విడిచింది. ఇవన్నీ ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనలో మనం ఎంత వెనుకబడి ఉన్నామో స్పష్టం చేస్తున్నాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి పాత పద్ధతులు ఇక ఏమాత్రం పనిచేయవు. ఆధునిక సాంకేతికతను, పటిష్టమైన విధానాలను జోడించి వినూత్న పరిష్కారాలు కనుగొనాలి. ఇరుకైన వీధుల్లోకి ఫైర్ ఇంజన్లు వెళ్లలేవు అనేది దశాబ్దాలుగా వింటున్న పాత సాకు. ఈ సవాలును జయించడానికి మనం ఆధునిక సాంకేతికతను వాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. వీధుల్లో ట్రాఫిక్ లేదా ఇరుకు మార్గాలు అడ్డంకిగా మారినప్పుడు, ఆకాశ మార్గం ద్వారా మంటలను అదుపులోకితెచ్చే డ్రోన్ వ్యవస్థలను నగరాల్లో తప్పనిసరి చేయాలి. అత్యవసర సహాయం అందించే 'ఫైర్ ఫైటింగ్ డ్రోన్లను', చిన్న సైజులో ఉండే 'మినీ ఫైర్ టెండర్లను' ప్రతి మార్కెట్ ప్రాంతంలో అందుబాటులోకి తీసుకురావాలి. డ్రోన్ల ద్వారా పై అంతస్తుల్లో ఉన్న మంటలను అత్యంత సులభంగా అదుపు చేయవచ్చు. దట్టమైన వాణిజ్య ప్రాంతాల్లో థర్మల్ ఇమేజింగ్ కెమెరాలతో ఏ ఇళ్లలో పరిమితికి మించి వేడి ఉత్పన్నం అవుతుందో ముందుగానే పసిగట్టే ప్రిడిక్టివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలను మున్సిపల్ కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానించాలి. మంటలు అంటుకున్నాక నీళ్లు చల్లడం కన్నా, ముందే ప్రమాదాన్ని పసిగట్టే సాంకేతికత మనకు చాలా అవసరం. అలాగే, వాణిజ్య సముదాయాల్లో థర్మల్ ఇమేజింగ్ సెన్సార్లను, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్మోక్ డిటెక్టర్లను అమర్చి, వాటిని నేరుగా అగ్నిమాపక కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించాలి. దీన్ని అరికట్టాలంటే నగరాల నిర్మాణ చట్టాలను పర్యావరణ అనుకూలంగా మార్చాలి. కేవలం ప్రమాదం జరిగినప్పుడు పరిహారం ప్రకటించడం వల్ల ప్రయోజనం లేదు. భవన నిర్మాణ చట్టాలను శాస్త్రీయంగా సవరించాలి. కేవలం స్థలవిస్తీర్ణాన్ని బట్టి కాకుండా శాస్త్ర, సాంకేతికతను ఆపాదించాలి. గాలి ప్రసరణకు అనుగుణంగా సమూలంగా సవరించాలి. ప్రతి కాలనీలో గాలి ప్రసరణకు అడ్డుపడని కారిడార్లను వదిలేలా చట్టపరమైన, పటిష్టమైన విధానాలను తీసుకురావాలి. గాలి ప్రసరణకు ప్రాధాన్యతనిస్తూ జోనింగ్ నిబంధనలను కఠినతరం చేయాలి. పటిష్టమైన ఫైర్‌సేఫ్టీ ఆడిట్‌లను నిరంతరం నిర్వహించడం, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలుతీసుకోవడంద్వారా మాత్రమే ఇలాంటి విషాదాలను శాశ్వతంగా నివారించగలం. పౌరులలో కూడా భద్రత పట్ల అవగాహన పెరగాలి. మూలాల్లో ఈ మార్పులు రానంతవరకు, ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్స్‌గ్రేషియాలు ప్రకటించడం మినహా మనం చేయగలిగింది ఏమీ ఉండదు. ●

# ఒత్తిడి తగ్గించాలంటే పరీక్షలే తీసేయాలా?

తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో 10వ తరగతి బోర్డు పరీక్షలను కొనసాగించాలా లేదా అన్న చర్చ ఇటీవల విద్యా రంగంలో వేడెక్కిన అంశంగా మారింది. విద్యార్థులపై మానసిక ఒత్తిడిని తగ్గించాలన్న ఉద్దేశంతో కొందరు బోర్డు పరీక్షలను రద్దు చేయాలని సూచిస్తుండగా, మరికొందరు ఇది విద్యా ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని సమగ్రంగా విశ్లేషించడం అవసరం. 10వ తరగతి బోర్డు పరీక్షలు భారత విద్యావ్యవస్థలో ఒక కీలక మైలురాయిగా భావించబడతాయి. విద్యార్థి విద్యా ప్రయాణంలో ఇది మొదటి ప్రధాన పరీక్ష. ఈ పరీక్ష ద్వారా విద్యార్థి తన విద్యా స్థాయిని అంచనా వేసుకోవడమే కాకుండా, భవిష్యత్తు విద్యా దిశను నిర్ణయించుకునే అవకాశం పొందుతాడు. బోర్డు పరీక్షలు ఉండటం వల్ల విద్యార్థుల్లో ఒక విధమైన బాధ్యతాభావం, క్రమశిక్షణ పెరుగుతాయి. లక్ష్యాన్ని చేరుకోవాలనే తపన వారికి కష్టపడి చదవడానికి ప్రేరణగా నిలుస్తుంది. అయితే, బోర్డు పరీక్షలపై ఉన్న ఒత్తిడి కూడా చిన్న విషయంకాదు. చాలా మంది విద్యార్థులు ఈ పరీక్షల కారణంగా మానసికంగా ఆందోళనకు గురవుతున్నారు. కొన్నిసార్లు ఈ ఒత్తిడి వారి ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో పరీక్షలను రద్దు చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించవచ్చని కొందరు భావిస్తున్నారు. అంతేకాకుండా, నిరంతర మూల్యాంకన విధానాల ద్వారా విద్యార్థి సామర్థ్యాన్ని సమగ్రంగా అంచనా వేయవచ్చని వాదిస్తున్నారు. కానీ, బోర్డు పరీక్షలను పూర్తిగా రద్దు చేయడం అనేది సరికాని నిర్ణయంగా భావించవచ్చు. ఎందుకంటే, పరీక్షలు లేకపోతే విద్యార్థుల్లో చదువుపై ఉన్న శ్రద్ధ తగ్గే అవకాశం ఉంది. ఒక స్పష్టమైన లక్ష్యం లేకపోతే చాలా మంది విద్యార్థులు నిర్లక్ష్యంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యపట్ల అవగాహన తక్కువగా ఉన్న చోట్ల, బోర్డు పరీక్షలు ఒక ప్రధాన ప్రేరణగా పనిచేస్తాయి. అవి



లేకపోతే విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. అదేవిధంగా, బోర్డు పరీక్షలు విద్యార్థుల మధ్య పోటీ భావనను పెంచుతాయి. ఈ పోటీ భావన వల్లవారు తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడానికి ప్రయత్నిస్తారు. పరీక్షలు లేకుండాపోతే ఈ పోటీ తగ్గిపోవచ్చు. దీని వల్ల విద్యా ప్రమాణాలు క్రమంగా పడిపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఉపాధ్యాయుల దృష్టిలో కూడా బోర్డు పరీక్షలు ఒక నియంత్రణ సాధనంగా పనిచేస్తాయి. పరీక్షలు ఉండటం వల్ల వారు సిలబస్‌ను సమయానికి పూర్తి చేయడానికి కృషి చేస్తారు. విద్యార్థులను కూడా సమర్థంగా సిద్ధం చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తారు. పరీక్షలు లేకుండా పోతే ఈ క్రమశిక్షణలో లోపం వచ్చే అవకాశం ఉంది. అయితే, దీనికి ప్రత్యామ్నాయాలు లేవనుకోవడం కూడా సరికాదు. పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి బోర్డు పరీక్షల రూపాన్ని మార్చడం ఒక మంచి పరిష్కారంగా ఉండవచ్చు. ఉదాహరణకు, ఒక్కసారి జరిగే భారీ పరీక్షకు బదులుగా, సెమిస్టర్ విధానం లేదా బహుళ చిన్న పరీక్షల ద్వారా విద్యార్థుల పనితీరునుఅంచనా వేయవచ్చు. అలాగే, ప్రాజెక్టులు, ప్రాక్టికల్స్, ప్రెజెంటేషన్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయవచ్చు. ఇక మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పాఠశాలల్లో కౌన్సెలింగ్ సదుపాయాలను పెంచడం అవసరం. విద్యార్థులకు ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో నేర్పించడం కూడా ముఖ్యం. పరీక్షల వల్ల కలిగే భయాన్ని తగ్గించడంద్వారా వారు మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలుగుతారు. సారాంశంగా చెప్పాలంటే, 10వ తరగతి బోర్డు పరీక్షలను పూర్తిగా రద్దుచేయడం కంటే, వాటిని సమర్థవంతంగా పునర్నిర్మించడం సమంజసం. విద్యార్థుల్లో భయం తగ్గిస్తూ, చదువుపై ఆసక్తి పెంచేవిధంగా వ్యవస్థను రూపుదిద్దాలి. విద్యా ప్రమాణాలు నిలబెట్టడం, విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడడం ఈరెండింటి మధ్య సమతౌల్యం సాధించడం ప్రభుత్వానికి, విద్యావేత్తలకు పెద్ద సవాల్. సరైన నిర్ణయం తీసుకుంటేనే భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్య అందించగలుగుతాం. ●

# అప్పుల ఊబిలోకి జారిపోతున్నామా?

ఇస్కా రాజేష్ బాబు

సామాన్యులే కాకుండా ప్రభుత్వాలు సైతం అప్పులు లేనిదే ముందుకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అప్పులు ప్రపంచ దేశా ఆర్థిక వ్యవస్థల గమనాన్ని నిర్దేశిస్తున్నాయి. సామాజిక సంక్షేమం మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక స్థిరత్వం కోసం దేశాలు చేస్తున్న అప్పులు అతి భారీ స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి వెల్లడించిన గణాంకాల ప్రకారం 2025-26 నాటికి ప్రపంచ దేశాల మొత్తం అప్పు 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ అప్పులో ఎక్కువ భాగం ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల్లోనే ఉండటం గమనార్హం. దేశంలోని 147 కోట్ల మంది జనాభాలో ప్రతి ఒక్కరిపై ఈ ఏడాది మార్చి నాటికి రూ.1.34 లక్షల అప్పుంది. ఇది వ్యక్తులు చేసిన అప్పు కాదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణం. అయినప్పటికీ ఈ సంవత్సరం (2026-27) కూడా భారీ స్థాయిలో అప్పులుచేయాల్సి వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14.61 లక్షల కోట్ల అప్పులు చేసిన కేంద్రం రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణానికి 17 శాతం ఎక్కువ కావడం గమనార్హం. 2026 27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ.53.47 లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో మార్కెట్ నుంచి మొత్తం రూ.17.2 లక్షల కోట్లు సేకరించాల్సి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల వెల్లడించారు. 2025-26 సవరించిన అంచనాల ప్రకారం కేంద్రం మొత్తం అప్పులు రూ.1,97,18,016 కోట్లు కాగా మార్చి 2027 నాటికి ఇది 2,14,82,050 కోట్లకు చేరనుంది. ఇక జీడీపీలో రుణ నిష్పత్తిని 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ నిష్పత్తి 2019లో 50 శాతంలోపే ఉంది. ఇక తాజా బడ్జెట్‌లో జీడీపీలో ద్రవ్యలోటును 4.3 శాతంగా అంచనా వేశారు. 2026 మార్చి 31నాటికి భారత కేంద్ర ప్రభుత్వం మొత్తం అప్పులు రూ. 197.18 లక్షల కోట్లకు (సుమారు ట్రిలియన్ డాలర్లు) చేరుకుంటాయని అంచనా వేశారు. ఇది 2026-27 ఆర్థిక సంవత్సరంలో మరింత పెరిగి రూ.214.82 లక్షల కోట్లకు చేరవచ్చని మొత్తం అప్పు సుమారు 85శాతంగా ఉంది. 2026లో 2025-26 ఆర్థిక సంవత్సరంలోకేంద్ర ప్రభుత్వ అప్పులు రూ. 197.18 లక్షల కోట్ల నుండి 2026-27 నాటికి రూ.214.82 లక్షల కోట్లకు పెరుగుతాయని అంచనా. వ్యక్తిగత భారం:2026 ప్రారంభానికి, దేశంలోని ప్రతి పౌరుడిపై సుమారు రూ. 1.34 లక్షల అప్పు (కేంద్రం చేసిన రుణాల ప్రకారం)ఉంది. ద్రవ్యలోటు: 2025-26లో 4.4 శాతం, 2026-27 నాటికి 4.3 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26 నాటికి 56.1శాతంగా



ఉన్న అప్పు జీడీపీ నిష్పత్తిని, 2026-27 నాటికి 55.6 శాతంకి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2026 మార్చి నాటికి అప్పులు రూ.7.46 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా వేశారు. 2026-27 బడ్జెట్‌లో గ్రాస్ మార్కెట్ బోరోయింగ్ (మొత్తం అప్పులు) సుమారు రూ. 17.2 లక్షల కోట్లుగా అంచనా వేశారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి తాజా గణాంకాల ప్రకారం ప్రపంచ దేశాల మొత్తం అప్పు 2025 నాటికి 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాల జాబితాలో అమెరికా తొలి స్థానంలో ఉండగా, భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో ఏడవ స్థానంలో ఉంది. ప్రభుత్వం తన రుణ నిష్పత్తిని 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచంలోనే అత్యధిక ప్రభుత్వ అప్పులు ఉన్న దేశంగా అగ్రరాజ్యం అమెరికా తొలి స్థానంలో నిలిచింది. అమెరికా మొత్తం అప్పు 38.27 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ప్రపంచ మొత్తం అప్పులో మూడో వంతు కంటే ఎక్కువ కావడం గమనార్హం. నిరంతర బడ్జెట్ లోటు, పెరుగుతున్న వడ్డీ చెల్లింపులే ఇందుకు ప్రధాన కారణమని ఐఎంఎఫ్ పేర్కొంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా ఈ విషయంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ డ్రాగన్ దేశం 18.68 ట్రిలియన్ డాలర్ల అప్పుల ఊబిలో ఉంది. చైనా అప్పులు 2025లో 13.6 శాతం వృద్ధితో అత్యంత వేగంగా పెరుగుతున్నట్లు ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంది. రుణాల ఊబి జాబితాలో జపాన్ కూడా ఉంది. ఈ దేశం 9.83 ట్రిలియన్ డాలర్ల అప్పుతో 3వ స్థానంలో నిలిచింది. జపాన్ అప్పు దాని జీడీపీలో దాదాపు 230 శాతంగా ఉండటం ఆ దేశ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక యూరప్ దేశాల్లోని యునైటెడ్ కింగ్‌డమ్ 4.09 ట్రిలియన్ డాలర్లతో 4వ స్థానం, ఫ్రాన్స్ 3.92 ట్రిలియన్ డాలర్లతో 5వ స్థానం, ఇటలీ 3.48 ట్రిలియన్ డాలర్లతో 6వ స్థానంలో నిలిచాయి. ఆయా దేశాల్లో సామాజిక సంక్షేమం, పించన్ల కోసం కోసం ఇబ్బడిముబ్బడిగా ఖర్చు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది. అన్ని దేశాల మాదిరిగానే భారత్ కూడా అప్పులు ఇబ్బడిముబ్బడిగా తీసుకుంటోంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాల జాబితాలో భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో 7వ స్థానంలో నిలిచింది. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. దీంతో అభివృద్ధి పనుల కోసం చేసే ఈ అప్పు సాధారణమేనని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఒక సానుకూల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దేశ అప్పుల నిష్పత్తిని జీడీపీలో 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇండియా తర్వాత స్థానాల్లో జర్మనీ 3.23 ట్రిలియన్ డాలర్లు, కెనడా 2.60 ట్రి.డా, బ్రెజిల్ 2.06 ట్రిలియన్ డాలర్ల అప్పులతో టాప్ 10 జాబితాలో నిలిచాయి. జర్మనీ ఆర్థిక క్రమశిక్షణ మారుపేరు. అయినప్పటికీ ఇంధన ఖర్చులు తదితర కారణాలతో అప్పులపాలైంది. కెనడా, బ్రెజిల్ బడ్జెట్ లోటు, ప్రాంతీయ రుణాల కారణంగా అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి. ●

గుంటూరు వార్త



## పాక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

**గుంటూరు,మార్చి 24, ప్రభాతవార్త ప్రతినిధి :** 2021లో గుంటూరు జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మైనర్ బాలికను వేధిస్తున్న కేసులో నిందితుడికి గుంటూరు పోక్సో కోర్టు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. గుంటూరు నగరంలోని మిర్చి యార్డ్ సమీపంలో నివసించే మైనర్ బాలిక పై ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రాజేష్ ప్రేమ పేరుతో వేధిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు.బాలిక కుటుంబం నిర్వహిస్తున్న చిన్న హోటల్‌కు నీటి కేన్లు సరఫరా చేసే సందర్భంలో పరిచయం ఏర్పరుచుకుని ఆమెను వేధించటం ప్రారంభించాడు.ఈ ఘటనపై దిశా మహిళా పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు నమోదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.ఈ కేసును విచారించిన గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి మొహమ్మద్ పర్వీన్ సుల్తానా బేగం సోమవారం నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో మహిళా పి.ఎస్ డీఎస్పీ డి. శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు అధికారి ఎస్ ఐ నాగూర్ మీరా సాహెబ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి. దుర్గాప్రసాద్,కోర్టు కానిస్టేబుల్ తదితరులు విచారణలో తమ వంతు కృషి చేశారు.

## నేడు గుంటూరులో ముఖ్యమంత్రి పర్యటన

**గుంటూరు, మార్చి 24, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నేడు గుంటూరులో పర్యటించనున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మంగళవారం గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులో గల శ్రీ కన్వెన్షన్ లో ఏర్పాట్లు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్ర, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రాజధాని ప్రాంతంలో అగ్నిప్రమాదం

**గుంటూరు క్రైమ్, మార్చి24,ప్రభాతవార్త:** అమరావతి రాజధాని పరిధిలోని రాయపూడి వద్ద మేఘా ఇంజనీరింగ్ సంస్థ స్టాక్ యార్డ్‌లో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అమరావతి రాజధాని ప్రాంతం, రాయపూడి గ్రామ సమీపంలో నూతన హెచ్‌ఓడి టవర్ల వద్ద ఉన్న మేఘా ఇంజనీరింగ్ సంస్థ స్టాక్ యార్డ్‌లో సోమవారం రాత్రి సుమారు 11:00 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. స్టాక్ యార్డ్‌లో నిల్వ ఉంచిన ప్లాస్టిక్ (HDPE) పైపులు మంటల్లో దగ్ధమయ్యాయి.ఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అర్ధరాత్రి వేళనే హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది చేపట్టిన చర్యలను సమీక్షిస్తూ, మంటలను త్వరితగతిన అదుపులోకి తీసుకురావడంపై దృష్టి సారించాలని స్థానిక పోలీస్ అధికారులకు ఆదేశించారు.అదే విధంగా ఈ ఘటనకు గల అసలు కారణాలను సాంకేతికంగా విశ్లేషించి నిర్ధారించాలని,ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఇతర కోణాలు ఉన్నాయా అన్నది అన్ని విధాలుగా సమగ్రంగా దర్యాప్తు చేయాలని,బాధ్యులెవరైనా ఉంటే వారిని వెంటనే గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే సంఘటన స్థలంలో భద్రతా ప్రమాణాలు, స్టాక్ యార్డ్ నిర్వహణ విధానాలపై కూడా సమగ్రంగా పరిశీలించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు..

## తెదేపా కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ 85వ రోజు ప్రజాదర్బార్

-ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరణ

-సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ

**మంగళగిరి, మార్చి 24, ప్రభాతవార్త :** మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 85వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ ను కలిసి సమస్యలు విన్నవించేందుకు వివిధ జిల్లాల నుంచి ప్రజలు, టీడీపీ కార్యకర్తలు తరలివచ్చారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వివిధ సమస్యలపై వారి నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్రంలో కేబుల్ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఏపీ ఫైబర్ నెట్ లో కాలం తీరిన బాక్స్ లకు 59 రూపాయల రెంటల్‌ను తొలగించాలని ఏపీ కేబుల్ ఆపరేటర్స్ జేఏసీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు.



సమస్యను సంబంధిత మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రంలో న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని, న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి



తీసుకురావాలని ఏలూరుకు చెందిన నిమ్మల జ్యోతి కుమార్ మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. విజయవాడ మొగల్రాజపురంలోని తమ ఖాళీ స్థలానికి సంబంధించి వేరొక వ్యక్తి పేరుపై అక్రమంగా ఇంటి పన్ను విధించిన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు సదరు పన్నును రద్దుచేసి న్యాయం చేయాలని గూడపాటి కోటేశ్వరరావు కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## బూరగలమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి అనగాని

**రేపల్లె, మార్చి 24, ప్రభాతవార్త:** పాతబస్టీలోని గ్రామదేవత బూరగలమ్మ అమ్మవారికి జరుగుతున్న పుష్కర మహాకుంభాభిషేక మహోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరాయి.దేవాలయం అర్చకస్వాములు నందివెలుగు భానుసుధాకర్,బాలాజీలు ప్రత్యేక అభిషేకాలు చేశారు.అమ్మవారిని పట్టు,రజత వస్త్రాలతో



అలంకరించారు. శాస్త్రోక్తంగా యాగశాలలో హోమాలు నిర్వహించారు.గ్రామదేవత బూరగలమ్మ అమ్మవారికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్,డి.సాంబశివరావు,కె.రాము తదితరులు పాల్గొన్నారు.

## 26న బీఆర్ స్టేడియంలో మల్టీపర్పస్ భవనానికి శంకుస్థాపన

- బీఆర్ స్టేడియానికి మహర్దశ తీసుకొస్తాం
- ఖేల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రూ.14 కోట్ల కేటాయింపు
- 19 రకాల క్రీడలకు అనుకూలంగా రెండు అంతస్తుల్లో భవన నిర్మాణం
- ప్రారంభించనున్న కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని
- ఏర్పాట్లను పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, మార్చి24,ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే అతి పెద్దదైన గుంటూరు నగరంలోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియానికి మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియాన్ని ఎమ్మెల్యే నసీర్



పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ బీఆర్ స్టేడియంలో ఈ నెల 26వ తేదీన కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతులమీదుగా మల్టీపర్పస్ భవన సముదాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధి కోసం రూ.170 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశామని వెల్లడించారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం, శానిటేషన్, నూతన భవన నిర్మాణాలు వంటి అభివృద్ధి పనుల నిర్వహణ చేపట్టనున్నామని తెలిపారు. ఖేల్ ఇండియా కార్యక్రమంలో బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధి కోసం 14 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని, వీటితో మల్టీపర్పస్ భవన సముదాయం నిర్మించబోతున్నామని వెల్లడించారు. 80 అడుగుల విస్తీర్ణంలో రెండు అంతస్తుల్లో నిర్మించే నూతన భవన సముదాయంలో బ్యాడ్మింటన్, షటిల్, బాస్కెట్ బాల్‌క్యారమ్స్, స్క్వాష్, డార్మిటరీ ఇలా 19 విభాగాలకు రూములు ఉంటాయని వెల్లడించారు. ప్రతి ఏటా కొంత నిధులు రాబట్టి బ్రహ్మానంద రెడ్డి స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో బ్రహ్మానంద రెడ్డి స్టేడియాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేయడంతో అధ్వాన స్థితికి చేరిందని, దీంతో కుక్కలు సంచరించేవని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రథమంగా బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధి కోసం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నానని తెలిపారు. శానిటేషన్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం వంటి పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. కూటమి ప్రభుత్వం, క్రీడల ప్రోత్సాహానికి ముందడుగు వేసిందని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అభివృద్ధి పనులకు అనుమతులివ్వండి

ఆటోనగర్‌లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయండి రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టండి నిరుపేదల ఇళ్లను రెగ్యులైజేషన్ చేయండి

మంత్రి నారాయణకు విన్నవించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళ మాధవి

**గుంటూరు,మార్చి24,ప్రభాతవార్త :** గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణను గుంటూరు



తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. వెలగపూడి సచివాలయంలోని మునిసిపల్ శాఖ సమీక్షలో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు అభివృద్ధిపై మంత్రి నారాయణకు నసీర్ వినతిపత్రం అందించారు. గుంటూరు నగరంలోని ఆటోనగర్ లో ప్రతి రోజూ వేల మంది కార్మికులు పని చేస్తుంటారని, ఈ ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆటోనగర్ లో వాటర్ ట్యాప్ కనెక్షన్ల ఫీజు తగ్గించాలని విన్నవించారు. మునిసిపాలిటీ పరిధిలోని పరమాయ కుంట, రామిరెడ్డి తోట ప్రాంతాల్లో పేదలకు సంబంధించి ఇళ్లను జీవో నంబర్ 30 ప్రకారం రెగ్యులైజేషన్ చేయాలని కోరారు. బాలాజీ నగర్, ఐపీడీ కాలనీ, నెహ్రూనగర్ మెయిన్ రోడ్డు, నాజ్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్, నాజ్ సెంటర్ నుంచి శనక్కాయల ఫ్యాక్టరీ, మణిపురం బ్రిడ్జి పక్కన రోడ్డు విస్తరణ వంటి పనులకు అనుమతులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 12 చెరువులు ఉన్నాయని, వర్షాకాలంలో పొంగి ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుత ఎన్నాయని వివరించారు. ఈ చెరువుల అభివృద్ధికి సహకారం అందించాలని విన్నవించారు. టిడ్కో ఇళ్ల పంపిణీకి చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని, మరి కొన్ని ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. వీటి నిర్మాణానికి వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. అన్ని అంశాలపై మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే నసీర్ వెల్లడించారు.

## బాపట్ల జిల్లాను అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలపాలి : మంత్రి కొలుసు పార్థసారధి

**బాపట్ల, మార్చి 24. ప్రభాతవార్త:** అభివృద్ధి పథంలో బాపట్ల జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డి డి ఆర్ సి) సమావేశంలో ఆయన ముఖ్యంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం, పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పనపై కీలక ఆదేశాలు జారీ చేశారు.





**సాగుకు ప్రాధాన్యం.. మే 15న నీటి విడుదల:**

జిల్లాలో సాగు విస్తీర్ణం 18.75 శాతం పెరగడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అదనంగా 58 వేల ఎకరాలను సాగులోకి తీసుకురావడంలో కలెక్టర్ చూపిన చొరవను ప్రశంసించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన మేరకు మే 15న సాగునీరు విడుదల చేస్తామని, ఆలోపే కాల్వల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు.

మరమ్మతు పనులు: రూ.13 కోట్లతో గుర్తించిన 600 పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. నీటి విడుదల సమయంలో పనులు చేస్తే సహించబోమని హెచ్చరించారు. పామాయిల్ సాగు లాభసాటిగా ఉన్నందున జిల్లాలో అనుకూల ప్రాంతాలను గుర్తించి రైతులను ప్రోత్సహించాలని, జొన్న, మొక్కజొన్న రైతులకు మద్దతు ధర అందేలా చూడాలన్నారు.

**టూరిజం హబ్‌గా బాపట్ల.. సూర్యలంక అభివృద్ధికి పెద్దపీట**

పర్యాటక రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. స్వదేశీ దర్శన్ రూ.97.52 కోట్లతో చేపట్టిన సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులను వర్షాకాలం లోపే పూర్తి చేయాలన్నారు.

**బాపట్లను గోవా తరహాలో పర్యాటక కేంద్రంగా** తీర్చిదిద్దాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. బీచ్ వద్ద పార్కింగ్ కోసం అటవీ భూముల వినియోగానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 22ఏ నిషేధిత జాబితా నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా 19 సమస్యాత్మక గ్రామాల్లోని చేతి పంపులను 10 రోజుల్లో మరమ్మతు చేయాలని మంత్రి ఆదేశించారు.

**తల్లికి వందనం:** ఈ పథకం కింద అర్హులైన ప్రతి విద్యార్థికి నగదు అందేలా చూడాలన్నారు.

**రహదారి భద్రత బ్లాక్ స్పాట్స్ గుర్తింపు**

జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారులపై 20, రాష్ట్ర రహదారులపై 79 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఏప్రిల్ 1 నుంచి శిరోరక్షప్రాణ రక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**జిల్లాకలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ**

సమగ్ర ప్రణాళికతో పనిచేయడం వల్ల జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెరిగిందన్నారు.రాష్ట్రస్థాయిలో గతంలో 13వ స్థానంలో ఉన్న బాపట్ల జిల్లా, ప్రస్తుతం 8వ స్థానానికి చేరుకుందని వివరించారు.ఈ సమావేశంలో మంత్రులు, కలెక్టర్ తో పాటు ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి

**గుంటూరు,మార్చి24,ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతూ, వైద్య ఖర్చులు భరించలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి మాట్లాడుతూ అత్యవసర వైద్య అవసరాలు మరియు ఇతర కష్టకాల పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతోందన్నారు.మంగళవారం ఒక్కరోజే మొత్తం 41 మందికి రూ.32,37,844/ విలువైన చెక్కులు అందజేయడం జరిగిందని, ఈ సహాయం ద్వారా అనేక కుటుంబాలకు ఉపశమనం కలిగిందని తెలిపారు.ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఎత్తున



ఆర్థిక సహాయం అందుతోందని, ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి స్పష్టం చేశారు.ఇప్పటివరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 505 మంది లబ్ధిదారులకు రూ.6,77,85,662/ విలువైన సహాయం అందజేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## తెనాలి పట్టణ పూర్వ వైభవానికి అధికారుల్లో సమన్వయం ఉండాలి

### రాష్ట్రంలో ప్రత్యేకస్థానంలో నిలిచేలా చర్యలు : మంత్రి నాదెండ్ల.

**తెనాలి మున్సిపాలిటీ, మార్చి24,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణానికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా, అన్ని రంగాల్లో రాష్ట్రంలో అయిదో స్థానంలో నిలిచేలా సమగ్ర చర్యలు చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు ఆదేశించారు.మంగళవారం పట్టణం లోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి పలు కీలక అంశాలపై దృష్టి సారించారు. ముందుగా పన్నుల వసూళ్లపై ఆరా తీసి, కనీసం 95 శాతం వసూళ్ల సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి మున్సిపాలిటీకి రావాల్సిన రూ.9 కోట్ల నిధులను త్వరితగతిన పొందేలా చర్యలు చేపట్టాలన్నారు.టెండర్లు పొంది పనులు ప్రారంభించని లేదా ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు వెంటనే చెల్లించాలని ఆదేశించారు.పట్టణంలో అసంపూర్తిగా ఉన్న భవనాల వివరాలు సేకరించి, వాటి పూర్తి కోసం ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. ఖాళీగా ఉన్న భవనాలను గుర్తించి, ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న సచివాలయాలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలను అక్కడికి మార్చాలని సూచించారు.ఐతానగర్‌లోని ఫైకస్ పార్క్ అభివృద్ధి పనులను ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేసి, మే నెలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. అమరావతి ప్లాట్స్‌లోని రెండు పార్కులను కూడా త్వరలో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.ప్రజా సమస్యలపై తక్షణ స్పందన



అవసరమని, అధికారులు ప్రజలతో మర్యాదగా వ్యవహరించి పట్టణంలో స్పష్టమైన మార్పు తీసుకురావాలని సూచించారు.మే మొదటి వారంలో పట్టణంలోని ప్రధాన కాల్వలు, ఇరిగేషన్ కాల్వల మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తూ ఖాళీ స్థలాల అభివృద్ధి కోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ ప్రత్యేక అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, మంత్రి సహకారంతో జిల్లాలో 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని తెలిపారు. ఇది జిల్లాలో రికార్డుగా నిలిచిందన్నారు. వచ్చే ఏడాది లక్ష మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తెనాలి మున్సిపల్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని పేర్కొన్న ఆయన, త్వరలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అభివృద్ధి అంశాలపై సమగ్ర చర్చ జరుపుతామని చెప్పారు. అధికారులు నిర్దిష్ట లక్ష్యాలతో గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

.పారిశుద్ధం, డ్రైనేజ్, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, మున్సిపల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించే దిశగా అధికారులు కృషి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా అధికారులు చేపట్టాల్సిన ముఖ్యమైన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ముఖ్యంగా,యాక్షన్ ప్లాన్ అమలు,శానిటేషన్ మెరుగుదల,ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా,చలివేంద్రాల ఏర్పాటు వంటి పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో,మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్,మేనేజర్ కే. విల్సన్ జయకర్,ఏసిపి వాణి,ఆర్ఓ రాంప్రసాద్, మెప్మా సిఎం విజయకుమారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఏసుబాబు, హౌసింగ్ ఈఈ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు మిర్చి యార్డులో.. రైతులకు అందుతున్న సేవలు భేష్

**గుంటూరు మార్చి 24, ప్రభాతవార్త, ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లాకు చెందిన వ్యవసాయ మార్కెటింగ్ కమిటి చైర్మన్ మినుపుల ప్రకాశ్ రావు,సెక్రటరీ నారా మనోహర్, డైరెక్టర్లు గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా



అప్పారావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గుంటూరు మిర్చి యార్డ్‌లో రైతులకు అందుతున్న సేవలు, మిర్చి క్రయ విక్రయాలు, మిర్చి యార్డు ఆదాయ వ్యయాలు, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పై సమగ్రంగా చర్చించారు. అనంతరం యార్డ్‌లో అమలు చేస్తున్న పలు అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించి, వాటి పనితీరును సమీక్షించారు.రైతులకు మెరుగైన సేవలు అందించ డంలో గుంటూరు మిర్చి యార్డ్ చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమని వారు అభిప్రాయ పడ్డారు.

**విజయ సునీత సేవలు అభినందనీయం**

ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ వ్యవసాయ శాఖ కమిషనర్‌గా



సేవలందించిన విజయ సునీత బదిలీపై మార్కాపురం జిల్లా కలెక్టర్‌గా నియమితులైన సందర్భంగా గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు.ఈ సందర్భంగా కుర్రా అప్పారావు మాట్లాడుతూ విజయ సునీత వ్యవసాయ శాఖలో పనిచేసిన సమయంలో చూపిన సమర్థత పరిపాలనా నైపుణ్యం అభినందనీయమని పేర్కొ న్నారు.మార్కాపురం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో ఆమె తన అనుభవం, నాయకత్వంలో జిల్లా అభివృద్ధి, పరిపాలనా సామర్థం, ప్రజా సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తారని ఆకాంక్షించారు.

## వినూత్న ఆవిష్కరణలకు ఏఐ దోహదం : డాక్టర్ సుధాకర్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి24, ప్రభాతవార్త:** మానవ మనుగడకు నూతన ఔషదాల ఆవిష్కరణలు నిరంతరం అవసరమని ఏఎన్‌యు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ అన్నారు. ఏఎన్‌యు ఫార్మశీ కళాశాల ఆధ్వర్యంలో రూసా 2.0 సహకారంతో రెండు రోజులుగా జరుగుతున్న మేథో మంతన్ 2026: ఇన్నోవేటివ్ ఎపిటోమ్స్ ఇన్ ఏఐ అసిస్టెంట్ డ్రగ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ అనే జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న డా. సుధాకర్ మాట్లాడుతూ కృత్రిమమేధస్సును మనం ప్రతీ రంగంలో ఉపయోగించుకోవాలని అన్నారు. కృత్రిమమేధస్సు ద్వారా చేసే ఆవిష్కరణలతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య దేవినేని జ్యోతిర్మయి మాట్లాడుతూ రెండు రోజుల జాతీయ సదస్సుకు సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.తేజోమూర్తి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డా.సుధాకర్ పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

# విద్యా అభివృద్ధే లక్ష్యం

### -బడిబాటతో అడ్మిషన్లకు శ్రీకారం - విద్యా అభివృద్ధికి ప్రభుత్వ కృషి

**మంగళగిరి, మార్చి 24, ప్రభాతవార్త :** బడిబాట కార్యక్రమం ద్వారా ఒకటి నుండి ఐదు తరగతుల వరకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్




తెలిపారు. పెదవడ్లపూడి గ్రామములోని యం.పి పి పాఠశాలలో మంగళవారం 2026 2027 బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ విద్యా రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించి, భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి అవసరాలను ఇప్పటికే మోడల్ స్థాయిలో అత్యుత్తమంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇదే సందర్భంగా మంత్రి నారా లోకేష్ విద్యా రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఆయన ప్రస్తావించారు. పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదల, స్మార్ట్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు, డిజిటల్ లెర్నింగ్ ప్రోత్సాహం, ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలు వంటి అంశాల ద్వారా విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, ఆంగ్ల పరిజ్ఞానం పెంపు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా పాఠశాలలలో నమోదు శాతాన్ని పెంచడం, చదువు మధ్యలో మానేసే విద్యార్థుల సంఖ్యను తగ్గించడం లక్ష్యంగా కృషి జరుగుతోందన్నారు. ప్రతి చిన్నారి విద్య హక్కు అనే భావనతో ఎవరూ చదువు దూరం కాకుండా చూడాలని పిలుపునిచ్చారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, పిల్లల భవిష్యత్‌ను బలోపేతం చేయాలంటే తల్లిదండ్రులు చొరవ చూపాలని జవ్వాది కిరణ్ చంద్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో డీఈవో సలీం భాషా, ఎంఈవో ఉష కుమారి, ఎంఈవో 2 బాబు, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ జె. శాంత కుమారి, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఓ శైలజ, టీడీపీ సీనియర్ నాయకులు మాదల రమేష్, హెచ్ఎం టీ అనంతలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఐజేయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

### -ముఖ్యఅతిథిగా సిఎం చంద్రబాబు హాజరు

**తెనాలి టౌన్ మార్చి24(ప్రభాతవార్త):** ఇండియన్ జర్నలిస్టు యూనియన్ ((ఐజెయు) జాతీయ మహాసభలు మార్చి 27, 28, 29 తేదీలలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే తెనాలి అధ్యక్షులు, ఐజేయు కేంద్ర సమితి సభ్యులు చందు సుబ్బారావు తెలిపారు. మంగళవారం స్థానిక గాంధీ నగర్ లోని ఏపీయూడబ్ల్యూజే కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మహాసభల వివరాలను వెల్లడించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 30 ఏళ్ల తర్వాత నిర్వహించే ఈ



ప్లీనరీలో 29 రాష్ట్రాల నుంచి 400 మంది పాత్రికేయ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. 28 వ తేదీ సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారని, పాత్రికేయుల సమస్యలపై ఆయన స్పందిస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే మహాసభలకు తెనాలి ప్రాంతానికి చెందిన పాత్రికేయ మిత్రులందరూ అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహాసభల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యూజే నాయకులు సుధాకర్, వెంకటేశ్వరావు, బొల్లిముంత కృష్ణ, మురళి, గోపీచంద్, సాయినాథ్, సుధీర్, శ్రీను, శరత్, ప్రసాద రెడ్డి, కమలాకర్, సత్య, కిరణ్, కళ్యాణ్, సత్యదేవ్, అప్పారావు, నరసింహ, భాస్కర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం,ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ నడుమ ఎంవోయూ

### హాజరైన కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాస్ రఘు

**మంగళగిరి, మార్చి 24, ప్రభాతవార్త :** ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ నడుమ వ్యూహాత్మక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. మంగళవారం యూనివర్సిటీలో డైరెక్టరేట్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ అండ్ ప్రొఫెషనల్ స్టడీస్ (డీప్స్) ఆధ్వర్యంలో జరిగిన ఎంవోయూ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాస్ రఘు హాజరయ్యారు. విద్యార్థుల్లో ప్రజా నాయకత్వంతో పాటు సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యంగా రెండు సంస్థల మధ్య ఎంవోయూ జరిగినట్లు డాక్టర్ శ్రీనివాస్ రఘు పేర్కొన్నారు. ప్రస్తుతం 23 పబ్లిక్ సెక్టార్లతో కలిసి పని చేస్తున్న ఏపీ పీపీ ఎనర్జీ, ఇండస్ట్రీ మేనేజ్మెంట్ తో పాటు నైపుణ్య శిక్షణ, కెరీర్ డెవలప్మెంట్ కోర్సుల నిర్వహణలో ముందు వరుసలో ఉందన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీతో కలసి ఉపయుక్తమైన నిర్ణయాలు తీసుకుని ఎంవోయూ లక్ష్యాలను అధిగమించడం జరుగుతుందన్నారు. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ యూనివర్సిటీ ప్రత్యేకత, అభివృద్ధి, బోధనా పద్ధతులు, విద్యార్థులకు అందుబాబులో ఉంచిన




కోర్సులు గురించి వివరించారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, ఏపీపీసీ డైరెక్టర్ జనరల్ శ్రీనివాస రఘులు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీప్స్ డైరెక్టర్ వెంకటేశ్వరన్ రామమూర్తి, అసోసియేట్ డైరెక్టర్ దువ్వూరి సత్యనారాయణ, యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ సీవీ టోమి , హెచ్ఆర్ డైరెక్టర్ ఐజక్ సామల, స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ మేజర్ జనరల్ గురుప్రీత్ సింగ్, ఏపీ ప్రొడక్టవిటీ కౌన్సిల్ ఇన్చార్జి కుర్రా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాంగణ ఎంపికలో ఆర్‌విఆర్‌జెసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ప్రతిభ

**గుంటూరు విద్య మార్చి 24 ప్రభాతవార్త :** ఇటీవల తమ కళాశాలలో డిజిటల్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సేవల్లో అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ఏటి టీ కమ్యూనికేషన్ సర్వీసెస్ సంస్థ కళాశాలలో క్లౌడ్ సర్వీసెస్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలపై అందిస్తున్న శిక్షణ ఫలితంగానే విద్యార్థులు ప్రపంచ స్థాయి సంస్థల్లో అవకాశాలు పొందుతున్నారని కళాశాల సెక్రటరీ



నిర్వహించిన ప్రాంగణ నియామకంలో డేటా సైన్స్ విభాగానికి చెందిన యెన్. ధర్మ తేజ రూ. 19 లక్షల భారీ ప్యాకేజీతో స్టాఫ్ అసోసియేట్ టెక్నికల్ ఇంజినీర్‌గా ప్రతిష్టాత్మక ఉద్యోగాన్ని సాధించడం కళాశాలకు గర్వకారణమని, ఇంటర్న్‌షిప్ కాలంలోనే నెలకు రూ. 63,000 స్టైపెండ్ పొందడం విద్యార్థి ప్రతిభకు నిదర్శనమని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్ మరియు డా. జగదీష్ కె. మద్దినేని హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఉద్యోగం సాధించిన విద్యార్థిని ది. 24032026 న మంగళవారం నాడు కళాశాల సిబ్బంది అభినందించారు. కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఇటువంటి గ్లోబల్ సంస్థలో చేరడం ద్వారా అంతర్జాతీయ స్థాయి అనుభవం పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ ఆర్ డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాసరావు, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారులు శ్రీ సి. హెచ్. శ్రీనివాసరావు, డా. కె. సురేష్ బాబు, కళాశాల డేటా సైన్స్ విభాగాధిపతి డా. ఎమ్.వి.పి. చంద్రశేఖర్ రావు, వివిధ శాఖల విభాగాధిపతులు, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్‌లు విద్యార్థిని అభినందించారు.

# పెదవడ్లపూడిలో ఘనంగా ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

### ఉత్తమ సేవా పురస్కారాల ప్రదానం

**పెదవడ్లపూడి(మంగళగిరి), మార్చి 24, ప్రభాతవార్త:** ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పెదవడ్లపూడిలో "ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై శ్రద్ధ వహిద్దాం" అనే నినాదంతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ. సతీష్ కుమార్, డాక్టర్ వాసు నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొని ర్యాలీని



ఉద్దేశించి ప్రసంగించారు. క్షయ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా జరిగిన ఈ ర్యాలీలో ఆరోగ్య శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షయ నివారణా చర్యల్లో విశేష సేవలందించిన పలువురు సిబ్బందికి ఖిబెస్ట్ ఎంప్లాయిఖి అవార్డులను ప్రకటించారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిహెచ్ఓ ఏ. దుర్గా ప్రసాద్, హెల్త్ సూపర్వైజర్ పి. లాజర్, ఏఎన్ఎం ఎం. సుజాత మరియు ఆశా వర్కర్ బి. సీత మహాలక్ష్మిలు ఎంపికయ్యారు. ఈ విజేతలను డాక్టర్ సతీష్ కుమార్ మరియు డాక్టర్ వాసు నాయక్ ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు పి. లాజర్, టి.ఎల్.కె రాణి, ఎస్.టి.ఎస్ మూర్తితో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కిట్స్‌లో యువ 2కె26 బ్రోచెర్ ఆవిష్కరణ

**వట్టిచెరుకూరు, మార్చి 24, ప్రభాతవార్త :** మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కిట్స్ యువ 2కె26 బ్రోచర్ ను ఆవిష్కరించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్‌సుబ్బారావుమాట్లాడుతూ.. ఈ ఏడాది కిట్స్ యువ 2కె26 కు సంబంధించిన కార్యక్రమాలు ఈ నెల 30, 31, ఏప్రిల్ 1తేదీలలో మూడు రోజులపాటు కళాశాల ప్రాంగణంలో




నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మూడు రోజులు పాటు విద్యార్థుల ప్రతిభ వికాసానికి వేదికగా నిలిచేలా విభిన్న రంగాలలో కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా సాంకేతిక, క్రీడలు, కల్చరల్ కార్యక్రమాలతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకునేలా బ్రోచర్ ను ఆవిష్కరించడం జరిగిందన్నారు. ప్రతి కార్యక్రమానికి సంబంధించిన పూర్తి షెడ్యూలు, ఈవెంట్ వివరాలు, పేర్ల నమోదు, బహుమతుల సమాచారం సమగ్రంగా పొందుపరిచినట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటుకుని విజేతలుగా నిలవాలని సూచించారు. అందరి సమిష్టి కృషితో కిట్స్ యువ 2కె26 ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు, అకాడమిక్ డైరెక్టర్ కె. హరిబాబు, వివిధ శాఖల హెచ్ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకై అవగాహన ర్యాలీ

**తెనాలి టౌన్ మార్చి24(ప్రభాతవార్త):** క్షయ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా ప్రభుత్వ వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సుల్తానాబాద్ లోని మార్తా గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్




విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. జిల్లా వైద్యశాల క్షయ విభాగం వైద్యాధికారి డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆమెతో పాటు ఆర్ఎంఓ డాక్టర్ మల్లిఖార్జున ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా ప్రభుత్వ వైద్యశాల నుండి ప్రారంభమై పట్టణంలో కొనసాగింది. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా మార్తా గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ యనమల ఈశ్వర్ మాట్లాడుతూ, క్షయ వ్యాధికి కారణాలు, నియంత్రణ, నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యాధి నిరోధకశక్తి లోపిస్తే క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రజలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలని అన్నారు. క్షయ వ్యాధిని 2030 నాటికి అంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, టీబీ సూపర్వైజర్ డాక్టర్ రవి కుమార్, కమలాకర్, రాజేష్, మార్తా గ్రూప్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ పి. ఆదిలక్ష్మి, పి. నళిని, కార్తీక, ప్రభాకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవాడలో జరగనున్న ఐజేయూ ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయండి

**వట్టిచెరుకూరు, మార్చి 24, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి దగ్గరలో నున్న విజయవాడ నగరంలోని శ్రీ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈ నెల 27, 28, 29 తేదీలలో నిర్వహించనున్న ఇండియన్ జర్నలిస్ట్ ల యూనియన్ (ఐజెయు)జాతీయ స్థాయి 11వ ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ప్రత్తిపాడు నియోజక వర్గం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం (ఏపీయూడబ్ల్యూజే) అధ్యక్షులు జోగి ఆనంద్ బాబు (హెచ్ఎం టివి) పిలుపునిచ్చారు.



ఐజేయు ప్లీనరీ సమావేశాలు విజయవంతం చేసే కార్యక్రమంలో భాగంగా వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు, గుంటూరు రూరల్ మండలాల యూనియన్ నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ నేత ఆనంద్ బాబు మాట్లాడుతూ.. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాల్లో అనుబంధ సంఘాలు ఉన్నాయని తెలిపారు. ఈ అనుబంధ సంఘాలలో సుమారు 30వేల మంది జర్మలిస్టులు సభ్యులుగా ఉన్నారని వివరించారు. ఈ ప్లీనరీ సమావేశాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. మీడియా సంబంధిత అంశాలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణను ఈ సమావేశాల్లో ఖరారు చేస్తారని పేర్కొన్నారు. అంతేకాకుండా జర్నలిస్టుల వృత్తి సమస్యలు, దేశంలో ప్రస్తుత మీడియా పరిస్థితులు, మీడియా స్వేచ్ఛపై ఉన్న ముప్పు మరియు సంస్థాగత అంశాలపై చర్చించడం జరుగుతుందని వెల్లడించారు. 24 ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ లో ఐజేయూ ప్లీనరీ సమావేశాలు రెండవసారి జరగడం రాష్ట్ర యూనియన్ కు చాలా గర్వకారణ మన్నారు. ఈనెల 28న జరిగే నదస్సుకు ముఖ్యమంత్రితో పాటు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, సి. రాఘవాచారి, ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి. సుబ్బారావు లతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, సోషలిస్ట్ భావ ప్రముఖులు, తదితరులు హాజరు కానున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశాల్లో జర్నలిస్టులకు సంబంధించిన పది తీర్మానాలు ఆమోదించబడతాయన్నారు. అనంతరం రెండేళ్ల పాటు కొనసాగే నూతన జాతీయ కార్యవర్గాన్ని కూడా ఎన్నుకుంటారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు ఈ ప్లీనరీ సమావేశాలకు హాజరు కానున్న నేపథ్యంలో మండల, నియోజకవర్గ, జిల్లాల నుంచి జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఐజేయు నెంబర్ కొంగర వెంకటసుబ్బయ్య(ఎన్ టీవీ), సెక్రెటరీ జెట్టి పరమేశ్వరరావు (ఆంధ్రప్రభ), వై. రమణ (వార్త), తదితర విలేకరులు పాల్గొన్నారు.

# హిందూ ఫార్మసీ కళాశాలలో సెవెన్ హిల్స్ ఫార్మసీ క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన

**గుంటూరు విద్య మార్చి 24 ప్రభాతవార్త :** హిందూ ఫార్మసీ కళాశాలలో సెవెన్ హిల్స్ ఫార్మసీ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు 44 మంది విద్యార్థులు




హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి నాగభూషణం తెలిపారు. ఫార్మసిస్ట్ పోస్టులకు నిర్వహించిన ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలకు అభ్యర్థుల నుంచి విశేష స్పందన వచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సెవెన్ హిల్స్ ఫార్మసీ సంస్థ గుంటూరు హెచ్ఆర్డి ప్రతినిధులు జీ. నరసింహారావు, ఎం వి నారాయణ లు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఈ ఇంటర్వ్యూలలో 15 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్ మధుసూదన్ రావులు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ పి సీతారామయ్య, డాక్టర్ ప్రత్యూష ,ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి బ్రహ్మ శ్రీనివాసరావు సభ్యులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు స్లాట్ బుకింగ్ చేయించుకోవాలి

**కొల్లిపర, మార్చి 24, ప్రభాతవార్త:** దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్ల కోసం ఈ నెల 25వ తేదీ నుండి నూతనంగా స్లాట్ బుకింగ్ చేయించుకోవాలని ఎంపిడివో విజయలక్ష్మి చెప్పారు. మంగళవారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్లాట్ బుకి ంగ్ వ్యవహారంలో దళారులను ఆశ్రయించవద్దని స్పష్టం చేశారు. స్లాట్ బుకి ంగ్ చేయించుకున్న వారికి ఈ నెల 30వ తేదీ నుండి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. 21 రకాల వైకల్యాలకు



ఆన్‌లైన్‌లోనే డిజిటల్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. సాఫ్ట్‌వేర్ ద్వారా పారదర్శకంగా ప్రస్తుతం సర్టిఫికెట్లను జారీచేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. అర్హులైన వారు స్లాట్‌ను నమోదు చేయించుకోవాలని దివ్యాంగులను ఆమె కోరారు.

# విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలి

**కొల్లిపర, మార్చి 24, ప్రభాతవార్త:** మండలంలోని విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఇవో ఝాన్సీలత చెప్పారు. మంగళవారం మండలంలోని కొల్లిపర, బొమ్మువానిపాలెం, తూములూరు ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు



పాటిస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఝాన్సీలత ఆదేశించారు. వంట చేసే విషయంలో ఆరోగ్య ప్రమాణాలను పాటించాలని ఆమె సూచించారు. పాఠశాలల్లో పారిశుధ్య సమస్య ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులకు వివరిస్తుండాలని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు.

# జీరో పావర్టీ పి4 వైద్య శిబిరం విజయవంతం

### తెనాలిలో 8945 బంగారు కుటుంబాలకు వైద్య సేవలు

**తెనాలి మున్సిపాలిటీ మార్చి 24(ప్రభాతవార్త):** జీరో పావర్టీ పి4 కార్యక్రమం భాగంగా స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్ మరియు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్, తెనాలి ఆధ్వర్యంలో, కిమ్స్ హాస్పిటల్, తెనాలి సహకారంతో తెనాలి పట్టణంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ప్రముఖ వైద్య నిపుణులు డా. కావూరి అనిల్ కుమార్ మరియు డా. కొల్లి శివరామ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 8945 బంగారు కుటుంబాలకు వైద్య సేవలు అందించేందుకు కార్యక్రమం చేపట్టబడింది. ఈ సందర్భంగా డా. కావూరి అనిల్ కుమార్ మాట్లాడుతూ, తెనాలి అర్బన్ పరిధిలో 8,945 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. శిబిరంలో కంటి శుక్లాలు (క్యాటరాక్ట్) ఆపరేషన్లు, మోకాలి జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలు, ఉచితంగా క్నీ క్యాప్స్ పంపిణీ, రెటీనా, గ్లాకోమా వంటి కంటి సమస్యల నిర్ధారణ పరీక్షలు, కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు మరియు ఓపీ సేవలు అందించబడ్డాయన్నారు. ఈ వైద్య శిబిరం షాదీఖానా, పాండురంగపేట, తెనాలి వద్ద నిర్వహించబడగా, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి సురేష్, యంగ్ ప్రొఫెషనల్, పాల్గొన్నారు.

# ప్రవీణ్ పగడాల మరణం తీరని లోటు!

**మంగళగిరి, మార్చి 24, ప్రభాతవార్త :** పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి తీరని లోటు అని లూథరన్ చర్చి దేవాలయం ప్రధాన కాపరి కంభం వర ప్రసాద్ అన్నారు. ప్రవీణ్ పగడాల ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి మంగళగిరి పట్టణంలోని మసీదు వీధిలో గల లూథరన్ చర్చి దేవాలయం నందు ఘనంగా నిర్వహించారు. హత సాక్షి ప్రవీణ్ పగడాల చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాన కాపరి కంభం వర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రవీణ్ పగడాల మరణించి ఏడాది గడిచిందని, శ్రమల దినాల్లో ఆయనను స్మరించుకుంటూ, కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రవీణ్ పగడాల మరణం తీరని లోటు



అయినప్పటికీ, శత్రువులను క్షమించాలంటూ, క్రీస్తు చేసిన బోధన ద్వారా వారిని క్షమిస్తున్నట్లు చెప్పారు. ప్రవీణ్ పగడాల ఆశయాలు నెరవేరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఒకటవ కాపరి నామా నవీన్, రెండవ కాపరి. దయా రత్నం, సంఘ పెద్దలు కారుమంచి రామారావు, దేవరాజు, సిల్వరాజు, తాడిగిరి సుధీర్, సికిందర్, చార్లెస్ భాస్కరరావు పాల్గొన్నారు

# హిందూ ధర్మ పరిరక్షణ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాలు

**గుంటూరు విద్య, మార్చి 24, ప్రభాతవార్త :** హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కాసుల కృష్ణంరాజు ఆధ్వర్యంలో . నూతన సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని సామూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఈ చక్కటి కార్యక్రమంలో ప్రతి గ్రామంలో ప్రతి జిల్లాలో చిన్నారుల తల్లిదండ్రులు ఉపాధ్యాయ ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు అందరికీ కూడా హృదయపూర్వక




హిక అక్షరాభ్యాస మహోత్సవం వేడుకలు గుంటూరు నాజ్ సెంటర్ లో నీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాసుల కృష్ణంరాజు మాట్లాడుతూ పురాతనాటి దేవాలయాల్లో అద్భుత మైనటువంటి వైబ్రేషన్ ఉంటుంది . పురాతనాటి సంస్కృతి సాంప్రదాయాలని గుర్తు చేసు కుంటూ ఆలయాలలో అర్చక మూర్తులతో వేద పండితులతో మంగళ వాయిద్యాలు మధ్య జరిగే టటువంటి సామూహిక అక్షరా భ్యాసం చిన్నారులకు అద్భుత మైనటు వంటి ప్రతిభ కనపరుసు ్తందని చెప్తుంది అందుకనే చిన్నారులకు ప్రతి దేవాలయాలలో ఉచితముగా అక్షరాభ్యాసం నిర్వహించడానికి శ్రీకారం చుట్టినది. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ దాసరి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కృతజ్ఞతలు తెలియపరచడం జరిగింది . కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ద్వారా చిన్నారులకు పుస్తకాలు బలపాలు బిస్కెట్లు చాక్లెట్స్ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో గుంటూరు కోఆర్డినేటర్ దాసరి గౌతమ్ కుమార్ కన్నా విద్యాల సంస్థ చైర్మన్ శ్రీ కన్నా మాస్టర్ గారు మరియు దేవాదాయ సిబ్బంది తదితర కార్యక్రమాల్లో పాల్గొని మంగళ వాయిద్యాల మధ్య జరిగిన ఈ అద్భుతమైన వేడుక విజయ వంతంగా ముగిసింది రానున్న రోజుల్లో మరొక నూతనమైనటు వంటి కార్యక్రమాలతో హిందూ ధర్మ పరిరక్షణ కార్యక్రమం శ్రీకారం చుడుతుందని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్ సాంస్కృతిక విభాగం కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కాసుల కృష్ణంరాజు తెలియపరిచారు

# సురక్షితమైన తాగునీరు అందించాలి

**కొల్లిపర, మార్చి 24, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలలో కుళాయిల ద్వారా ప్రతి కుటుంబానికి సురక్షితమైన నీటిని అందించాలని ఎంపిడివో విజయలక్ష్మి చెప్పారు. మంగళవారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించే విధానంపై అధికారులు అవగాహన సదస్సు




నిర్వహించారు. ఎంపిడివో విజయలక్ష్మి మాట్లాడుతూ మంచినీటి నాణ్యత పరీక్షలు నిబంధనల ప్రకారం జరగాలన్నారు. ప్రజలకు మంచినీటి సరఫరా విషయంలో అలసత్వం ఉండరాదని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నాణ్యత పరీక్షలు చేయాలని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ సుధాకర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వాటర్ టెస్టింగ్ కిట్స్ వాడటం ద్వారా నీటి నాణ్యతను సులువుగా పరీక్షించవచ్చని సూచించారు. నీటి రంగు, రుచి, వాసనలో మార్పు వస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడివో దానయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా వార్త



## పన్ను వసూళ్లను వేగవంతం చేయండి : ప్రత్యేకాధికారి

**మాచర్ల, మార్చి 24 ప్రభాతవార్త:** ప్రతి ఇంటికి వెళ్లి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ప్రత్యేకాధికారి మురళీకృష్ణ అన్నారు. పురపాలక శాఖ కార్యాలయంలో సచివాలయ సెక్రటరీలు, సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి మొత్తం రూ.9.92 కోట్ల డిమాండ్ ఉండగా, ఇప్పటి వరకు రూ.4.32 కోట్లు మాత్రమే



వసూలయ్యాయన్నారు. ఇది 44 శాతం మాత్రమే అన్నారు. మార్చి 31 లోపు బకాయిలు చెల్లిస్తే వడ్డీపై రాయితీలు లభిస్తాయని ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. పట్టణ అభివృద్ధికి సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని, టాక్స్ వసూలుతోపాటు పారిశుద్ధ్యం, మౌలిక వసతులు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. మంచినీరు, విద్యుత్తు వంటి సదుపాయాలపై నివేదిక ఇవ్వాలన్నారు. సచివాలయాల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పన్ను వసూళ్లను 100 శాతం పూర్తి చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో తహశీల్దారు కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ శాఖ మంత్రిని కలిసిన ఎస్సీఎస్టీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ అధ్యక్షులు

**మాచర్ల, మార్చి 24 ప్రభాతవార్త:** గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని ఎస్సీ ఎస్టీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ అధ్యక్షులు మరియదాసు మంగళవారం కలిశారు. ఉద్యోగుల సమసనయలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీనిపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలు ఉద్యోగ నాయకులు జోగారావు, ప్రభుదాసు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



## ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టరు

**నరసరావుపేట, మార్చి 24 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కలెక్టరు కృతిక శుక్లా ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్ల గోడౌన్ ను తనిఖీ చేశారు. స్థానిక గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా



నరసరావుపేటలో మార్కెట్ యార్డ్ లో గల ఈవియం గోడౌన్ వద్ద సిసి కెమెరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈవియం యంత్రాలు, బి.యులు, సియులు, వివిప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పరిశీలన అనంతరం రిజిస్టరులో కలెక్టరు సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవియం జిల్లా కలెక్టరు కృతిక శుక్లా మాట్లాడుతూ, భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవియం గోడౌన్ కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటి కప్పుడు గోడౌన్ ను క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. ఈవియం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు.

## జేసీతో కలిసి పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే

**నరసరావుపేట టౌన్, మార్చి 24,ప్రభాతవార్త :** ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హా మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ



సందర్భంగా పట్టణంలోని 5, 6, 7 వార్డులలోని కాలనీలలో పర్యటించి, అక్కడ నివసిస్తున్న సుమారు 360 ఇండ్ల వారికి పొజిషన్ పట్టాలు ఇచ్చే అంశంపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఎస్.ఆర్.కె.టి కాలనీలోని 18వ లైన్ సమీపంలో నివసిస్తున్న నిరుపేదలకు పట్టాలు ఇచ్చే ప్రక్రియను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యను పరిష్కరించడానికి ఎమ్మెల్యే ఎంతగానో కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా, నరసరావుపేటను ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు వినూత్న ప్రణాళికలతో ముందుకు సాగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ అందరి మన్ననలు పొందుతున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రెవెన్యూ సమస్యలను ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తున్నామని చెప్పారు. పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. జిల్లా జేసీ, అర్హులైన వారందరికీ త్వరలోనే పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కుడి కాలువలో దూకి యువకుడు ఆత్మహత్య

**మాచర్ల, మార్చి 24 ప్రభాతవార్త:** ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు మాచర్ల పరిధిలోని కుడి కాలువలో దూకి గల్లంతైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెల్దుర్తి మండలం కండ్లకుంటకు చెందిన కర్ల ఆంజనేయులు (27) స్థానిక ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. బంధువులకు, స్నేహితులకు ఫోన్ చేసి ఇదేనా చివరి మాట అని బాధతో చెప్పినట్లు సమాచారం. స్కూల్‌కు వెళ్తున్నానని చెప్పి మాచర్ల సవమీపంలోని కుడి కాలువ వద్ద మద్యం సేవించి, సెల్‌ఫోన్, చేతిగుడ్డ వదిలి కనిపించకుండాపోయాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



## ఆలోచనలు మారితేనే అధిక లాభాలు : ప్రత్తిపాటి

### -వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికే ప్రభుత్వం కృషి - 'రైతన్నా మీకోసం' ద్వారా రైతుల్లో చైతన్యం

చిలకలూరిపేట,మార్చి 24, ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ, కాలానికి తగినట్టు తమ ఆలోచనలు, సాగు విధానాలు మారుస్తూ, డిమాండ్ ఉన్న పంటల సాగుద్వారా రైతుల అధిక



లాభాలు అర్జించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. నాదెండ్ల మండలం అమీన్ సాహెబ్ పాలెం, అప్పాపురం గ్రామాల్లో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత అమీన్ సాహెబ్ పాలెంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ప్రత్తిపాటి, మరో రూ.10లక్షలతో నిర్మించాల్సిన సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పలువురు రైతుల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వం సేద్యానికి, రైతులకు అందిస్తున్న సాయాన్ని వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో మాట్లాడారు. రైతాంగం ఆలోచనలు, సాగు విధానాలు మారితేనే సేద్యంతో అధికలాభాలు పొందడం సాధ్యమవుతుందని, ఈ విషయంపై ప్రతి రైతు తప్పకుండా ఆలోచన చేయాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రభుత్వం ఎక్కువ ప్రోత్సాహకాలు, రాయితీలు అందించే ఉద్యాన పంటలసాగుపై రైతాంగం దృష్టి సారించాలని, తొలిసారి సాగుచేపట్టేటప్పుడు రైతులు చిన్నచిన్న సమస్యలు ఎదుర్కొన్నా..తర్వాత అధిక లాభాలు పొందుతారని ప్రత్తిపాటి చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా పంటలసాగుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తాయని, వాటి ఆధారంగా ఏ ప్రాంతంలో ఏ పంటలు వేస్తే బాగుంటుందనే ఆలోచన చేసి రైతులు సాగుకు సన్నద్ధం కావాలని ప్రత్తిపాటి సూచించారు. డిమాండ్ అధికంగా ఉన్న పంటల సాగుతో కచ్చితంగా లాభాలు పొందుతారన్నారు. మిర్చి, పత్తి, పొగాకు వంటి వాణిజ్య పంటల సాగుకు అలవాటు పడిన రైతులు, వేరే పంటల సాగుపై మొగ్గుచూపడానికి ఇష్టపడటం లేదని, వారు కొత్త ఆలోచనలు చేయాలనే ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమం చేపట్టిందన్నారు. ఆదర్శ రైతులు, వ్యవసాయాధికారులు నిత్యం రైతులతో మాట్లాడుతూ, వారిలోచైతన్యం నింపాలని, వారిని కొత్త సాగు విధానాల వైపు మళ్లించాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, రైతు నాయకులు గుర్రం నాగపూర్ణ చంద్రరావు, గ్రామ నాయకులు పునాటి కోటేశ్వరరావు, గుర్రం రామారావు, గుర్రం ఉపేంద్ర, సర్పంచి కామినేని లలిత , నెల్లూరి రామారావు, గ్రామ నాయకులు నెల్లూరి హరిబాబు, జగదీష్ , గొట్టిపాటి రామారావు, మస్తాన్ వలి, శంకర్ రావు, అధికారులు ఏవో శ్రీలత, పంచాయతీ ఏఈ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మే2తో ముగియనున్న సర్పంచుల పాలన

### -పగ్గాలు చేపట్టనున్న ప్రత్యేకాధికారులు -ఆరు నెలల్లోపు రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు

**కారంపూడి, మార్చి 23 ప్రభాతవార్త:** ప్రజలచే ఎన్నుకోబడి ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచిన గ్రామ పంచాయతీ సర్పంచుల పాలన మే 2తో ముగియనుంది. మే 3 నుంచి ప్రత్యేకాధికారులు కొలువు తీరనున్నారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. ప్రత్యేకాధికారుల జాబితా తయారీ, నియామకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులిచ్చింది.




**సమస్యల నిలయాలు పంచాయతీలు**

అనేక గ్రామ పంచాయతీల్లో చాలా సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. ఇంటి పన్నులు వసూలు, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, వివిధ రకాల పింఛన్ల పంపిణీ పర్యవేక్షించడం, అభివృద్ధి పనులకు అంచనాలు తయారు చేయడం, సమీక్షించడం, అర్జీల పరిష్కారం వంటి పనులను ప్రత్యేకాధికారులు చూడాల్సి ఉంటుంది.

**సవాలుగా ప్రత్యేకాధికారుల పాలన**

ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేకాధికారుల పాలన ప్రభుత్వానికి సవాలుగా మారనుంది. ఇప్పటికే చాలా పంచాయతీల్లో సిబ్బంది కొరత ఉంది. ఒక పంచాయతీ అధికారి మరొక 2, 3 గ్రామాలకు కూడా ఇన్‌ఛార్జిలుగా ఉన్న దుస్థితి. దీంతో సిబ్బందిపై పనిభారం పెరిగింది. వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వం కోరిన వివిధ విభాగాల సమాచారం తయారు చేయడం, ఉన్నతాధికారులకు పంపించడం వంటి పనులతో అధికారులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

**అభివృద్ధి పథంలో పాలన కోరుతున్న ప్రజలు**

ప్రత్యేకాధికారుల ద్వారా సుపరిపాలనను ప్రజలు కోరుతున్నారు. కారంపూడి మండలంలోని అన్ని గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించి స్వర్ణ పంచాయతీలుగా ఆచరణలో వచ్చే విధంగా ప్రభుత్వం పాలనాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఏపి ఎంఎస్ఎంఇ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, మార్చి 24, ప్రభాతవార్త: 75 తాళ్లూరు లో జరిగిన ఏపీ ఎంఎస్ఎంఇ సదస్సులో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడారు. సొంతంగా ఒక పరిశ్రమను స్థాపించాలనే ఆశ చాలా మందిలో ఉంటుందని అయితే భూమి అందుబాటు, మౌలిక సదుపాయాలు, ప్రారంభ పెట్టుబడి వంటి అంశాలు కొత్త పరిశ్రమల స్థాపనలో పెద్ద సవాళ్లుగా మారుతాయన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో ఎంఎస్ఎంఇ ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేయబడుతున్నాయని తెలిపారు. ఈ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి అవసరమైన రహదారులు, విద్యుత్ సరఫరా, నీటి సదుపాయం, ఇతర మౌలిక వసతులు ముందుగానే సిద్ధంగా ఉంటాయన్నారు. దీంతో పరిశ్రమలను త్వరగా ప్రారంభించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా ఐడిపి పాలసీ 4.0 ద్వారా భూమి అభివృద్ధి కోసం ఆర్థిక సహాయం అందించడం ద్వారా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి భారం తగ్గుతుందన్నారు. ఈ విధమైన ప్రైవేట్ ఎంఎస్ఎంఇ ఇండస్ట్రియల్ పార్కులు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడుతూ కొత్త పరిశ్రమలకు మార్గం చూపడమే కాకుండా స్థానికంగా ఉపాధి అవకాశాలను కూడా పెంచుతున్నాయన్నారు. ఫలితంగా ప్రాంతీయ అభివృద్ధి మరియు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతోంది. మహిళలు కుటుంబానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజ అభివృద్ధికి, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కీలక శక్తిగా ఎదగాలన్న దూరదృష్టితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు దశాబ్దాల క్రితం ప్రారంభించిన డ్వాక్రా ఉద్యమం లక్షలాది మహిళల జీవితాల్లో సానుకూల మార్పును తీసుకొచ్చిందని గుర్తుచేశారు. పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.




## ఉద్యాన పంటలతోనే అధిక ఆదాయం : ప్రత్తిపాటి

**యడ్లపాడు, మార్చి 24, ప్రభాతవార్త :** ప్రతి ఎకరాకు అధిక దిగుబడి. ప్రతి రైతుకు మంచి లాభం రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయానికి, పాడిపోషణకు ప్రభుత్వాలు అందించే రాయితీలను రైతాంగం సద్వినియోగం చేసుకొని, తమ జీవనప్రమాణాలు మెరుగు పరుచుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. రైతన్నా మీకోసం - అన్నదాతా సుఖీభవ కార్యక్రమంలో భాగంగా యడ్లపాడు మండలం సందెపూడి గ్రామాల్లో వ్యవసాయవిభాగం నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రత్తిపాటి పాల్గొన్నారు. సందెపూడిలో రూ30 లక్షలతో నిర్మించ తలపెట్టిన సామాజిక భవనం (కమ్యూనిటీ హాల్), రూ10లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రైన్లకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం పలువురు రైతుల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వవిధివిధానాలు, నూతనసాగు పద్ధతులను ప్రత్తిపాటి అన్నదాతలకు అర్థమయ్యేలా వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో మాట్లాడారు. ఎకరాకు రూ2 నుంచి రూ3 లక్షల ఆదాయమొచ్చేపంటలే సాగు చేయాలని, ఎకరాకు రూ4 నుంచి రూ5 లక్షల ఆదాయం వచ్చే ఉద్యాన పంటల సాగుకు రైతులు ఈ ఏడాదే సిద్ధం కావాలన్నారు. ఏడాదికి రూ4, లేదా రూ5 లక్షల ఆదాయం వస్తే దానిలో ఖర్చులు రూ2లక్షలు పోయినా రైతుకు రూ2 లేదా 3లక్షలు తప్పకుండా మిగులుతాయన్నారు. 90శాతం సబ్సిడీపై ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వాలు అందించే అన్నిరకాల రాయితీలను రైతులు వినియోగించు కొని, తమ జీవితాలు



మార్చుకోవాలన్నారు. పంట ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. డిమాండ్ అధికంగా ఉండి, ఎక్కువ దిగుబడినిచ్చే పంటలసాగువైపు రైతులు మళ్లడానికి ఇదే సరైన సమయమని ప్రత్తిపాటి సూచించారు. సేంద్రీయ పద్ధతిలో పండించే కూరగాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కాలానుగుణంగా రైతులు పంటలు మార్చాలని, అలానే తమ ఆలోచనలు, సాగు విధానాలు కూడా మార్చుకోవాలని ప్రత్తిపాటి రైతులకు సూచించారు. అర్హులైన వారు ఉచిత ఇళ్లస్థలాలకు ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలి...టీడీపీ మేనిఫెస్టో హామీ ప్రకారం త్వరలోనే ఇళ్లస్థలాలు లేని పేద, మధ్యతరగతి వర్గాలకు పల్లెల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఉచిత స్థలాలు అందచేయనున్నట్లు ప్రత్తిపాటి చెప్పారు. ఇంటిపట్టాలు పొందాలంటే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరూ ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రతి ఒక్కరూ సచివాలయాన్ని సంప్రదించి, నిర్దేశించిన అర్హతల ప్రకారం ఉచిత ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాయకుల కష్టాన్ని గుర్తించకపోతే, ప్రజలకు మరోసారి కష్టనష్టాలే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, ప్రజలు వాటిపై విస్తృతమైన చర్చ చేపట్టాలని, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేవారి ఆలోచనావిధానం మార్చాలని ప్రత్తిపాటి సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ల కష్టాన్ని గుర్తించకపోతే, మరోసారి ప్రజలు ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, రాష్ట్రానికి దుర్దినాలు దాపురిస్తాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. స్థానిక నాయకులపై అసూయ, ద్వేషంతో గ్రామాల్ని అభివృద్ధికి దూరం చేయవద్దని ప్రత్తిపాటి ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. మూడుపార్టీల నాయకులు కూడా తమచర్యలతో ప్రజలకు, పార్టీలకు మంచి జరిగేలా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావు, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, రైతు అధ్యక్షులు అంబటి సోంబాబు, మద్దినేని సుబ్బారావు, టీడీపీ నాయకులు కందిమల్ల రఘురామారావు, ముద్దన నాగేశ్వరరావు, మద్దినేనీ శివరామ కృష్ణ, కట్టా వేణు, కొండ్రగుంట శ్రీను, దాసు, ప్రభుదాసు, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు, ఎమ్మార్వో, ఎంపీడీవో, గ్రామ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్లకు ఇంటి స్థలాల అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తాను

### -కూటమిప్రభుత్వం పాస్టర్లకు రూ.5వేల గౌరవ వేతనం అందిస్తోంది: ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, మార్చి 24, ప్రభాతవార్త:** కూటమిప్రభుత్వం క్రైస్తవ సమాజ హితానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, క్రైస్తవుల అభ్యున్నతికి విశేషంగా కృషి



చేస్తోందని, పాస్టర్ల సంక్షేమానికి కట్టుబడి ఉందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని దివ్యశాంతి నిలయంలో ప్రముఖ దైవజనులు నందమూరి క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ వార్షిక సర్వసభ్య సమావేశం 2026కు ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జీవితాశయం అయిన పేదరికం లేని సమాజ నిర్మాణంలో క్రైస్తవ మతబోధకులు భాగస్వాములు కావాలని ప్రత్తిపాటి సూచించారు. పాస్టర్లకు ప్రభుత్వం ప్రతినెలా రూ.5వేల గౌరవ వేతనం అందిస్తోందని, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రభువు సేవలో తరించే ప్రతి ఒక్కరూ ఈ ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులేనని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని పాస్టర్లకు ఇంటిస్థలాలు అందచేయడంపై ప్రభుత్వంతో చర్చిస్తాను పాస్టర్లు ఎప్పటినుంచో ఇళ్లస్థలాలు కావాలని కోరుతున్నారని, నియోజకవర్గంలోని పాస్టర్ల తరఫున సమస్యపై ప్రభుత్వంతో చర్చించి, దీనికి పరిష్కారమార్గం చూస్తానని ఈ సందర్భంగా ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి ఇంటి స్థలం లేని పేదలకుఉచితంగా ఇళ్లపట్టాలు ఇవ్వడానికి సిద్ధమైందని, అదే జాబితాలో పాస్టర్లకు కూడా ఇళ్లస్థలాలు అందించేందుకు కృషి చేస్తామని ప్రత్తిపాటి తెలిపారు. ప్రభువు బోధనలు, ఆయన సూచించిన శాంతి, ప్రేమ మార్గాన్ని ప్రతి క్రైస్తవుడు/క్రైస్తవురాలు తప్పకుండా ఆచరించాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర నాయకులు ఇనగంటి జగదీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, జాకోబు రాజు, టీడీపీ నాయకులు, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 37 వార్డు పరిధిలో కొత్త పెన్షన్లకు దరఖాస్తుల అందజేత

### -ప్రజలకు అండగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి : పాములపాటి శివకుమారి

**చిలకలూరిపేట, మార్చి 24, ప్రభాతవార్త:** పట్టణంలోని 37వ వార్డులో నూతన పెన్షన్ల వార్డు పరిధిలోని వితంతువులు, వృద్ధులు మరియు దివ్యాంగుల నుండి సేకరించిన 21 నూతన పెన్షన్ దరఖాస్తులను మాజీ కౌన్సిలర్ పాములపాటి శివకుమారి సోమవారం వార్డు సచివాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి మరియు పేదల సంక్షేమం మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తోనే సాధ్యమని కొనియాడారు. గతంలో కూడా ప్రత్తిపాటి పుల్లారావు కృషితోనే దరఖాస్తు చేసుకున్న వెంటనే అర్హులకు పెన్షన్లు మంజూరయ్యాయని, అదే ఒరవడి ఇప్పుడు కూడా కొనసాగుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



## అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

### -సీపీఐ పట్టణ కార్యదర్శి కరిముల్లా

**పిడుగురాళ్ల, మార్చి 24 ప్రభాతవార్త :** అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ కరిముల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ మధుబాబుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కరిముల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేయాలని, భూమిలేని నిరుపేదలకు సాగుభూమి పంపిణీ చేయాలని, టిడ్కో గృహాలను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని, బాడుగ ఇళ్లల్లో నివసించే పేద వారికి ఇంటి అద్దె చెల్లించాలని, జీవో ఎంఎస్ నెంబరు 23 సడలించాలని, భూమాఫియాను అరికట్టాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని, పట్టణాల్లో, గ్రామాల్లో, దళిత వాడల్లో, శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఆదర్శనగర్ శాఖ కార్యదర్శి ఏలే వెంకటరమణ, కృష్ణ, పుల్లయ్య, ఏఐఎస్ఎఫ్ నేత ఎస్కే నజీర్, మహిళా సమాఖ్య నాయకురాలు వెంకయమ్మ తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## భట్టిప్రోలులో యుటిఎఫ్ నిరాహార దీక్ష

**భట్టి ప్రోలు(రేపల్లె), మార్చి 24, ప్రభాతవార్త:** ఉద్యోగుల,ఉపాధ్యాయుల పిఆర్సీ,డిఏ బకాయిలు చెల్లించాలని,మెమో 57 వర్తింపు తదితర ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం భట్టి ప్రోలులో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేశారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు,యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జడ వినయ్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి,గుర్రం శాంతారావు,బడుగు



వినోద్‌బాబు,అల్తాఫ్,సురేష్, చిరంజీవి, సాంబశివరావు,మేరీ ఫ్లోరెన్స్,పుష్పరాజ్,శేఖర్, లక్ష్మీనారాయణ, జాన్ సైదులు,నాగేశ్వరరావు, రమణి, కృష్ణప్రియ,కె.సీతామహలక్ష్మి,కె.అరుణ్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెన్షన్ పంపిణీ సకాలంలో పూర్తి చేయాలి

నిజాంపట్నం, మార్చి 24, ప్రభాతవార్త: పెన్షన్‌లబ్దిదారుల పట్ల పంపిణీ చేసే సిబ్బంది సక్రమమైన ప్రవర్తన కలిగి ఉండాలని డిఆర్‌డిఎ పిడి బి సింగయ్య అన్నారు. మంగళవారం నిజాంపట్నం వచ్చిన సందర్భంగా సచివాలయం 2, ఆముదాలపల్లిలో ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



పబ్లిక్ పార్టిసిపేషన్ పర్సెప్షన్(పిపిపి)లో నిజాంపట్నం 2, ఆముదాలపల్లి చివరి స్థానంలో ఉండటం దారుణమన్నారు. ప్రతి నెలా 1వ తేదీన లబ్దిదారుల ఇంటికి వెళ్ళి పెన్షన్ అందించాలని, సకాలంలో పంపిణీ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ కార్య క్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాగలక్ష్మి, ఎపిఎం మస్తాన్‌రావు, ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిలో బాపట్ల నంబర్ వన్ కావాలి!

-జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారథి పిలుపు
-కలెక్టరేట్‌లో ఘనంగా జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం
-వ్యవసాయ వృద్ధిలో భళా.. 58 వేల ఎకరాల అదనపు సాగుపై ప్రశంసలు
-మే 15న సాగునీటి విడుదల.. ముందస్తుగానే కాలువల మరమ్మతులు పూర్తి చేయాలి
-గోవా తరహాలో తీర ప్రాంత అభివృద్ధి: మంత్రి అనగాని సత్యప్రసాద్

**బాపట్ల, మార్చి 24. ప్రభాతవార్త:** అభివృద్ధిలోనూ, సంక్షేమంలోనూ బాపట్ల జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం అత్యంత కీలకమైన చర్చల మధ్య జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో





పనిచేయాలని సూచించారు.

**వ్యవసాయ రంగంలో అద్భుత ప్రగతి**

జిల్లాలో వ్యవసాయ రంగం గణనీయమైన వృద్ధిని సాధించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. గతంలో కంటే భిన్నంగా 18.75 శాతం సాగు విస్తీర్ణం పెరిగిందని, అదనంగా 58 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయడం అభినందనీయమన్నారు. రైతుల తలసరి ఆదాయం పెరిగేలా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తీసుకుంటున్న చొరవను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. పామాయిల్ సాగుకు అనుకూల ప్రాంతాలను గుర్తించి రైతులను ప్రోత్సహించాలని, జొన్న, మొక్కజొన్న రైతులకు మద్దతు ధర అందేలా చూడాలని సూచించారు.మే 15న సాగునీరు విడుదల చేస్తామని సీఎం ప్రకటించారన్నారు.ఆలోపే కాలువల మరమ్మతులు, నిర్వహణ పనులు పూర్తి కావాలిఖిఖి అని మంత్రి స్పష్టం చేశారు. రూ.13 కోట్లతో ప్రతిపాదించిన 600 పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. సాగునీరు విడుదల చేసిన తర్వాత పనులు చేపడితే సహించేది లేదని, ఆయకట్టు చివరి భూములకు నీరు అందడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

**పర్యాటక రంగం: బాపట్ల టు గోవా**

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాను గోవా తరహాలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సూర్యలంక బీచ్‌లో రూ.97.52 కోట్లతో చేపట్టిన ఖిస్వదేశీ దర్శన్‌ఖి పనుల్లో నాణ్యత పాటించాలని, ఉప్పునీరు వాడుతున్నారనే ఫిర్యాదులపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. నిజాంపట్నం, వాడరేవు హార్బర్ పనులను వేగవంతం చేయాలని కోరారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**

రెవెన్యూ: 22ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూముల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.వేసవి దృష్ట్యా 19 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు.10 రోజుల్లో పాడైన చేతి పంపులకు మరమ్మతులు చేయాలన్నారు.

రోడ్డు భద్రత: జాతీయ రహదారులపై 20 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, ఏప్రిల్ 1 నుంచి ఖిశిరోరక్షప్రాణరక్షఖి కార్యక్రమం ప్రారంభిస్తామని ఎస్పీ ఉమామహేశ్వరరావు తెలిపారు.

నిధుల కేటాయింపు.. పనుల వేగం

జల జీవన్ మిషన్ పనుల కోసం రూ.117 కోట్ల నిధుల కేటాయింపుకు అసెంబ్లీలో తీర్మానం జరిగిందని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని మంత్రి అనగాని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ పార్కులు, కోల్డ్ స్టోరేజ్ల ఏర్పాటు ద్వారా పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేయాలని సమావేశం నిర్ణయించింది.

ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి, ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవతో ఆర్థిక ప్రయోజనం : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**భట్టిప్రోలు(రేపల్లె),మార్చి 24, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకంతో రైతు కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని మాజీ మంత్రి,వేమూరు నియోజకవర్గ శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు చెప్పారు.మంగళవారం భట్టి



ప్రోలు మండలంలోని పెదపులివర్రులో అన్నదాత సుఖీభవ పథకంపై అవగాహన కార్యక్రమం జరిగింది.ఇంటింటికి వెళ్ళి రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ప్రతి రైతు కుటుంబానికి ప్రతి సంవత్సరం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందుతున్నదని చెప్పారు.మొదటి విడతగా రూ.7 వేలు,రెండో విడతగా రూ.7 వేలు,మూడో విడతగా రూ.6 వేలు వంతున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నదని వివరించారు.రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు.ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల వ్యవధిలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని ఆయన చెప్పారు.అనేక సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చే విధంగా ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నదని ఆనందబాబు పేర్కొన్నారు.ఇటువంటి ప్రభుత్వం పట్ల ప్రజలు కృతజ్ఞతాభావంతో ఉండాలని ఆయన కోరారు.కూటమి పాలనతోనే సంక్షేమం నెరవేరుతుందని గుర్తించాలని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా,వేములపల్లి జగన్నాథరావు,వాకా శేషుబాబు,నూతక్కి దినకర్‌బాబు, బి.గాంధీ,ఏడుకొండలు,రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల,పెన్షనర్ల బకాయిల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలి

### యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

**రేపల్లె, మార్చి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగుల,పెన్షనర్ల బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.మంగళవారం రేపల్లె పట్టణంలో యుటిఎఫ్ నిర్వహించిన నిరాహార దీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే పెండింగ్ డిఏలను విడుదల చేయాలన్నారు.29 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని చెప్పారు.పిఆర్సీ కమిషన్ ఛైర్మన్ నియామకం పూర్తి చేయాలని ఆయన కోరారు.సిపిఎస్ రద్దు చేస్తూ 57 ఉత్తర్వు ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నియామక ప్రక్రియ పూర్తిచేసుకున్న వారికి పాత పెన్షన్ అమలు చేయాలని యుటిఎఫ్ పోరాడుతున్నదని తెలిపారు.హెల్త్ కార్డులు,మెడికల్ బిల్లులు వంటి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.కోవిడ్ సమయంలో మృతి చెందిన 953 మంది పంచాయతీ రాజ్ ఉద్యోగ,ఉపాధ్యాయ కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించాలని వెంకటేశ్వర్లు కోరారు.సమస్యలను పరిష్కరించకుంటే సచివాలయం వద్ద రాష్ట్రంలోని ఉపాధ్యాయులంతా ధరా ్న చేస్తామని ఆయన హెచ్చరించారు.బాపట్ల జిల్లా సిఐటియు కోశాధికారి సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం అదే ధోరణిని అవలంభిస్తున్నదని విమర్శించారు.ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేరని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.న్యాయమైన ఉద్యోగుల, ఉపాధ్యాయుల,కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్



చేశారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నేత జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కె.శరత్‌బాబు,బసవేశ్వరరావు,యుటిఎఫ్ బాపట్ల జిల్లా శాఖ సహాధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం,రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ .బాపయ్య, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శాంతారావు,రే ంపల్లె,చెరుక పల్లి,నిజాంపట్నం,నగరం మండల యుటిఎఫ్ శాఖల అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, వి.సుబ్బారావు, టి.సుబ్బారావు,అక్రమ్ గోరి,గణేష్ రావు,కె.రాంబాబు,చందు కోటేశ్వరరావు,రేపల్లె పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ వై.కిషోర్,ఉద్యోగ,కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ

**బాపట్ల. మార్చి 24. ప్రభాతవార్త:** ఈ నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లా చీరాల మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ మంగళవారం సాయంత్రం ఏర్పాట్లను ముమ్మరంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్‌తో కలిసి ముఖ్యమంత్రి సందర్శించే పలు ప్రాంతాలను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పట్టణంలోని వీఆర్ఎస్ వైఆర్ఎన్ కళాశాల, మెడికల్ కాలేజీ పరిసరాల్లో హెలిప్యాడ్ నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు.విద్యా సంస్థల తనిఖీ: చీరాల మున్సిపాలిటీ పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, జెడ్పీ హైస్కూల్, ఓడరేవు జెడ్పీ స్కూల్, కటారివారిపాలెం పాఠశాలలను సందర్శించారు.సంక్షేమ వసతి గృహాలు: సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, చీరాల ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలోని బీసీ సంక్షేమ వసతి గృహాలను కలెక్టర్ బృందం పర్యవేక్షించారు.ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన భద్రత, ప్రోటోకాల్ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ



పర్యటనలో చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జ్ డీడీ సత్యనారాయణ, గిరిజన సంక్షేమ అధికారి అబ్బులు, చీరాల, వేటపాలెం తహశీల్దార్లు గోపికృష్ణ, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతతో వ్యాపారాలు వెలవెల

**కర్లపాలెం. మార్చి24. ప్రభాతవార్త:** కర్లపాలెం మండలంలో గ్యాస్ కొరతతో హోటల్ నిర్వాహకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజు వారు పెట్టే ఆహార పదార్థాలలో దాదాపుగా చాలావరకు వాటిని తగ్గించి వేశారు మండల పరిధిలో గత పది రోజుల క్రితం బుక్ చేసుకున్న గ్యాస్ ను ఇప్పటివరకు






అందించలేదు. అంతేకాకుండా వినియోగదారులకు అందుబాటులో ఉండాల్సిన హనుమాన్ సాయి గ్యాస్ ఏజెన్సీ వారు వారి ఫోన్ నెంబర్లను స్విచ్ ఆఫ్ చేసుకున్నారు దీంతో వినియోగదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అసలు గ్యాస్ ఎప్పుడు వస్తుందో కూడా తెలియని పరిస్థితి కర్లపాలెం మండలంలో నెలకొంది దీనిపై సమాచారం అందించడానికి కూడా గ్యాస్ ఏజెన్సీలు అందుబాటులో లేకపోవడం ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తుంది గ్యాస్ కొరత వల్ల వ్యాపారాలు తగ్గాయని వ్యాపారస్తులు వాపోతున్నారు ఇప్పటికైనా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు స్పందించి వినియోగ దారులకు అందుబాటులో ఉండి సమాచారం అందిస్తే పరిస్థితి సక్క పెట్టవచ్చు. క్యాష్ బుక్ చేసుకున్న ఎన్ని రోజులకు సిలిండర్ అందజేస్తారు అని స్పష్టమైన సమాచారం లేకపోవడం కూడా ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తుంది.

## బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి అనగాని సత్యప్రసాద్

**చెరుకుపల్లి మార్చి 24, ప్రభాతవార్త :** బాధిత కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు తన వంతు ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటానని రాష్ట్ర



రెవిన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కనగాల గ్రామానికి చెందిన పీటా గోపాలం కుటుంబ సభ్యులు మంగళవారం ఆయన పరామర్శించారు. గోపాలం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. పార్టీ, ప్రభుత్వ పరంగా తగిన విధంగా ఆదుకుంటామని సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాత ఏడుకొండలు, మల్లాది రామకృష్ణ,పూషడపు కుమారస్వామి, ఉయ్యూరు వెంకట శివ, రాము పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతతో చెరుకుపల్లి ప్రాంతాల్లో మూతపడుతున్న చిరు హోటళ్లు

### ఉపాధి లేక అల్లాడుతున్న బాధితులు

**చెరుకుపల్లి ,మార్చి 24, ప్రభాతవార్త :** గత పది రోజులుగా నెలకొన్న గ్యాస్ సప్లై కొరత కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో చిరు వ్యాపారాలు మూతపడుతున్నాయి. ముఖ్యంగా రోడ్డు వెంట రోజువారి నిర్వహిస్తున్న చిరు హోటళ్లు ఇప్పటికే మూతబడటంతో అటు వ్యాపారాలు లెక్క ఇటు పని లేక చిరు వ్యాపారులు దిక్కుతోచని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. 45 రోజులకు ఒకసారి మాత్రమే గ్యాస్ బుకింగ్ అవుతుండడంతో గ్యాస్ లేక కట్టెల పొయ్యి పై వండలేక చిరు హోటళ్లను మూసి వేసినట్లు బాధిత నిర్వాహకులు వాపోతున్నారు. ఇడ్లీ ,అట్టు, బోండాలు అమ్ముకుంటూ రోజువారి కూలీ నాలి డబ్బులు సంపాదించుకునే వాళ్ళమని గ్యాస్ కొరత పుణ్యమా



అని తాము ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని పలువురు చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సప్లై సరిగా లేక బ్లాక్ లో కొందామంటే 3000 నుంచి 4 వేల రూపాయల వరకు ధర చెప్తున్నారని చేసేదిలేక వ్యాపారాలు ఆపేసామని చిరు వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి మరో వారం రోజులు ఇలాగే కొనసాగితే పెద్దపెద్ద హోటల్ లో కూడా గ్యాస్ కొరత కారణంగా వ్యాపారాలు చేయలేక నష్టపోయే అవకాశం ఉందని సంబంధిత వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. గతంలో 15 రోజులకు ఒకసారి గ్యాస్ బుక్ అయ్యేదని తద్వారా చిన్నపాటి హోటల్ నడుపుకుంటూ జీవనం సాగించే వాళ్ళమని ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో జీవనోపాధి కోల్పోయామని చిరు వ్యాపారులు, వారి వద్ద పనిచేసే కార్మికులు మనో వేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గ్యాస్ కొరత సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే వ్యాపారాలతో పాటు గృహ అవసరాలకు కూడా ఈ సమస్య ఏర్పడుతుందని ప్రజానీకం వ్యక్తం చేస్తుంది.

## రోగులు,వృద్ధులకు పండ్లు పంపిణీ

**రేపల్లె, మార్చి 24, ప్రభాతవార్త:**

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నేత అనగాని శివప్రసాద్ జన్మదినోత్సవం



సందర్భంగా మంగళవారం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు,5వ వార్డులో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు పంతాని సాయికుమార్,ఐటిడిపి అధ్యక్షుడు బొర్రా సూర్యరాజు,విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయం కమిటీ సభ్యుడు జి.వి.నాగేశ్వరరావు,వాకా చిరంజీవి,పొనుగుపాటి సుబ్బు,గమిడి మహేష్,కొప్పుల రామరాజు,ఉయ్యూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.అన్న అనగాని శివప్రసాద్ జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు,మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు,రేపల్లె టౌన్ సిఐ మల్లికార్జునరావు,రేపల్లె మండల తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు,ప్రభుత్వ శాఖల అధికారులు,కూటమి పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## అపరాల్లో ఉత్పాదికత పెంచేలా చర్యలు తీసుకోవాలి

**నగరం, మార్చి 24, ప్రభాతవార్త:** అపరాల్లో ఉపాధి కల్పించి రైతులకు అధిక ఆదాయం పొందాలని నగరం మండలం వ్యవసాయ అధికారి వి. రమేష్ బాబు అన్నారు. మంగళవారం ధూళిపూడి నార్త్ మరియు అద్దంకివారిపాలెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, మిషన్ ఫర్ ఆత్మనిర్భారత ఇన్ రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అపరాల్లో



దిగుబడులు తగ్గుతున్నాయని వాటి ఉత్పాదికత పెంచడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ ఫర్ ఆత్మనిర్భారత కార్యక్రమం ప్రతి గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అపరాల్లో దిగుబడి తక్కువ మోతాదులో ఉన్నందువల్ల మన దేశం ఇతర దేశాల మీద ఆధారపడి దిగుమతి చేసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య,ఏఈఓ నాగ శ్రీనివాసరావు , రైతులు తదితరులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధి నిర్మూలన కోరుతూ ర్యాలీ

**రేపల్లె, మార్చి 24, ప్రభాతవార్త:** ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని టి.బి యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం రేపల్లె ప్రభుత్వ




వైద్యశాలలో నిర్వహించారు.చీరాల రామానంద ట్రస్ట్ సహకారంతో రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య ఆధ్వర్యంలో టి.బి రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా 30 పడకల వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.పృధ్వీగణేష్ మాట్లాడుతూ క్షయ లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్య చికిత్స పొందాలని సూచించారు.క్షయ విభాగం సూపర్ వైజర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు,జ్వరం,కళ్ళెలో రక్తం పడటం,బరువు తగ్గటం,ఆయాసం లక్షణాలు కనిపిస్తే విధిగా కళ్ళె పరీక్ష చేయించుకోవాలని సూచించారు.మలేరియా,ఫైలేరియా సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు చైతన్య,ప్రియాంక,జీవన్,సూపర్ వైజర్ జి.చక్రధర్,టిబిహెచ్‌వి శ్రీధర్,ఎల్‌టి అన్నపూర్ణ,విజ్ఞాన్ ఒకేషనల్ విద్యార్థులు,వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అనగాని శివప్రసాద్ జన్మదిన వేడుకలు

**నిజాంపట్నం, మార్చి 24, ప్రభాతవార్త:** రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన నిజాంపట్నం , ఆముదాలపల్లి, బావాజీ పాలెం గ్రామాల నుంచి భారీగా అభిమానులు తరలివెళ్ళారు. జడ్పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో వందలాది మంది ర్యాలీగా రేపల్లెకు వెళ్ళి అక్కడ జరిగిన అనగాని శివప్రసాద్



పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. గజమాలతో ఆయనను సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదెపా నాయకులు ఖాదర్‌బాబు, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, పచ్చభట్ల గంగరాజు, పిఏసిఎస్ అధ్యక్షుడు నరేష్, కేసన మోహనరావు, నక్కల పోలిరాజు, జాని, బడుగు శివ, నర్రా సునీల్ తదితరులున్నారు.

## పిఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలి

### -యుటిఎఫ్ సీనియర్ నాయకుడు రంగారావు

**పొన్నూరు, మార్చి 24,ప్రభాతవార్త:** యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పిఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ సీనియర్ నాయకుడు కె.రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్సీ కమీషన్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలన్నారు. 29శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మామీ మేరకు సీపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఛలో అసెంబ్లీ కార ్యక్రమాన్ని చేపట్టి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకుడు నిమ్మకూరి రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, కెవిఎస్ఎన్ కోటేశ్వరరావు, గేరా ఏసోబు, నరసింహారావు, శివప్రసాద్ పాల్గొన్నారు.

## గుంటూరు నగరాభివృద్ధికి అధికారులు,ప్రజా ప్రతినిధుల సమన్వయంతో

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### -రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ

**గుంటూరు కార్పొరేషన్, మార్చి 24, (ప్రభాతవార్త) :** గుంటూరు నగరాభివృద్దికి అధికారులు ప్రజా ప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధి



పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనుల పై మంగళవారం అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఆయన ఛాంబర్ లోరాష్ట్ర పురపాలన సంచాలకులు సంపత్ కుమార్, నగర కమిషనర్ కె. మయూర్ అశోక్, యం.యల్.ఏ లు మహమ్మద్ నసీర్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, నగర పాలక సంస్థ విభాగాదిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గుంటూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాల మంత్రి అడిగి తెలుసుకొని, నియోజకవర్గాల వారీగా జరుగుతున్నఅభివృద్ధి పనుల పై సమీక్షించారు. నగర పాలక సంస్థ నిధుల వివరాలు తెలుసుకొని, రానున్న కాలంలో నగర పాలక సంస్థ చేపట్టనున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్ట్ లను క్షేత్ర స్థాయిలో వేగవంతం చేయాలన్నారు. నగరంలో మురుగు నీటి పారుదల మెరుగుదలకు అవసరమైన డ్రైన్ల నిర్మాణానికి ప్రభుత్వం నుండి అదనపు నిధులను కేటాయిస్తామని తెలిపారు.వేసవి కాలం దృష్ట్యా త్రాగు నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన రహదారులతో పాటు ఖాళీ స్థలాలు, పార్కులలో పచ్చదనం పెంపుకు ప్రణాళికాబద్దంగా ముందుకెల్లాలన్నారు. త్వరలో లబ్దిదారులకు అందించనున్న టిడ్కో ఇళ్ళు పూర్తి స్థాయిలో సిద్దం చేయడంతో పాటు, ఖాళీగా ఉన్న ప్లాట్లను అర్హులైన లబ్దిదారులకు కేటాయించుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో భవన నిర్మాణాల కొరకు దరఖాస్తు చేసుకున్న ఆర్జీలను, యల్.ఆర్.యస్, లే అవుట్ అనుమతుల దరఖాస్తులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నగరాభివృద్దికి రాష్ట్ర ప్రభుత్వం, నగర పాలక సంస్థ చేపట్టే చర్యలకు ప్రజా ప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ విభాగాధిపతులు, నగర పాలక సంస్థ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**మంగళగిరి, మార్చి 24, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలాలు కేటాయించి, గృహ నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మంగళగిరి పట్టణంలోని నగరక పాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమంలో నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుకు, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అర్జీలతో పాటు వినతి పత్రాన్ని అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలు కేటాయించి, గృహ నిర్మాణానికి రూ. 4 లక్షల సాయం చేస్తామని ఇచ్చిన హామీ ఇంకా అమలు కాలేదని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల కావస్తున్నా ఇళ్ల స్థలాల పంపిణీపై స్పష్టమైన పురోగతి కనిపించడం లేదని




అన్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, షేక్ మదీనా, నూతక్కి శ్రీనివాసరావు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెళ్ళ వెంకటయ్య, జవ్వాది సాంబశివరావు, పంతగాని మరియదాసు, పొదిలి మరియదాసు,ఆకురాతి శ్రీనివాసరావు, బాపనపల్లి వెంకటేశ్వరరావు, ఉయ్యాల సత్యనారాయణ, జె శంకర్రావు, సందుపట్ల భూపతి, జాలాది నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక శాస్త్రాలతో సమాజంలో విలువలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి24, ప్రభాతవార్త:** నేటి సాంకేతిక యుగంలో సామాజిక శాస్త్రాల అధ్యయనంతోనే విలువలు పెరుగుతాయని కృష్ణా, ఎన్టిఆర్ జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సువార్త అన్నారు. వర్సిటీలోని సోషియాలజీ అండ్ సోషల్‌వర్క్ విభాగం ఆధ్వర్యంలో రూసా 2.0 సహకారంతో ' ఇండియా ఆఫ్టర్ 75 ఇయర్స్ – టెక్నలాజికల్ డెవలప్‌మెంట్ అండ్ సోషల్ డిఫెన్స్ ఇష్యూస్' అనే అంశంపై వారం రోజుల జాతీయ కార్యశాలలో సువార్త కీనోట్ స్పీకర్‌గా పాల్గొన్నారు. ఆమె ప్రపంచ వ్యాప్తంగా బాల నేరస్థుల గురించి సమగ్రమైన వివరణలు అందించారు. బాల నేరస్తుల జీవన విధానం, నేరస్థులుగా మారటానికి గల కారణాలు, సమాజం వారి పట్ల స్పందించే విధానం, బాల్య నేరములను నియంత్రించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న విధి విధానాలు, చట్టాల రూపకల్పన వివషయాలపై సమగ్రంగా వివరించారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎం.నగేష్ మాట్లాడుతూ డ్రగ్స్ తతీసుకోవడం వల్ల వ్యక్తిగతంగా, సామాజికంగా కలిగే దుష్పరిణామాలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కార్యశాల డైరెక్టర్, సోషియాలజీ అండ్ సోషల్‌వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎం.త్రిమూర్తిరావు ముఖ్యవక్తలను సన్మానించారు. ఈ కార్యశాలలో సోషల్‌సైన్స్ డీన్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, బిఓఎస్ చైర్‌పర్సన్ సరస్వతీ రాజు అయ్యర్, అధ్యాపకులు కె.ధనలక్ష్మి, అతిధి అధ్యాపకులు డా.పి.రాజకుమార్, డా.ఎస్.రాజశేఖర్, పరిశోధకులు పాల్గొన్నారు.




## టిడ్కో గృహ సముదాయాల్లో సమగ్ర మౌలిక వసతుల కల్పనపై నివేదిక సమర్పించండి

### -నగర కమిషనర్ కే మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, మార్చి 24, (ప్రభాతవార్త) :** టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పన చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ టిడ్కో ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం వెంగళాయపాలెంలోని టిడ్కో గృహ సముదాయాలు, గోశాల తదితర ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్ లో ఉన్న టిడ్కో గృహసముదాయాలను త్వరలో లబ్దిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సదరు గృహసముదాయానికి ట్రీట్మెంట్ చేసిన నీటిని అందించాలని, స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటుకు సిపిడిసిఎల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. టిడ్కో గృహసముదాయాల్లో చేపట్టిన పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. రోడ్ల కు ఇరువైపుల మొక్కలు నాటడం, ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయాలన్నారు. సేవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనితీరుని పరిశీలించి, నిర్దేశిత మార్గదర్శకాల మేరకు ప్లాంట్ పని చేయడం లేదని, సదరు ఏజన్సీ ప్రతినిధులను పిలిచి మాట్లాడాలని ఆదేశించారు . టిడ్కో గృహ సముదాయాల్లో స్థానికుల ఫిర్యాదు మేరకు తక్షణం పిచ్చి మొక్కలను జేసిబితో శుభ్రం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు , ప్రతి రోజు చెత్త సేకరణకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిఎంసి గోశాలని పరిశీలించి, ఎన్ని ఆవులు ఉన్నదీ, విధుల్లో ఉన్న



సిబ్బంది, మౌలిక వసతుల వివరాలను అడిగి తెలుసుకొని, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని, సూడి ఆవులకు ప్రత్యేకంగా షెడ్ ని ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గోశాలకు తరలించిన ఆవుల ఆరోగ్య స్థితిని, వాటికి ఆహారం సక్రమంగా అందేలా వెటర్నరీ అసిస్టెంట్ పర్యవేక్షణ చేయాలన్నారు.పర్యటనలో జిఎంసి సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, టిడ్కో ఎస్ఈ సి.సుబ్బారాయుడు, డిసిపి సూరజ్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, వివిఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, ఈఈ విష్ణు, డిఈఈ శ్రీనివాస్, బయాలజిస్ట్ శేషయ్య, ఉపా సెల్ పిఓ సింహాచలం, ఎస్ఎస్ రాజేష్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## భద్రతా ఏర్పాట్లు పరిశీలన

**గుంటూరు క్రైమ్,మార్చి24,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి,తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సరియాతో కలసి భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం సమీక్షించారు.మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాల నరేంద్ర కుమార్ కుమార్తె వివాహమునకు ఇద్దరు ముఖ్యమంత్రులు హాజరవుతారు. కావున జిల్లా పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.ఈ సందర్భంగా జిల్లా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పోలీస్ అధికారులు ముఖ్యమంత్రి వచ్చే రూట్,హెలిప్యాడ్ లను ఏర్పాటుచేసిన ప్రాంతాలలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు.ముఖ్యంగా ఇద్దరు ముఖ్యమంత్రులును దృష్టిలో ఉంచుకుని,మార్గమంతా రూట్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, జనసంచారం నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.హెలిప్యాడ్ నుండి శ్రీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వరకు మార్గమంతా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని,ముఖ్యమంత్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబడదని,ట్రాఫిక్ డైవర్షన్లను సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని,సున్నిత ప్రాంతాలలో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని,సీసీ కెమెరాలు, చెక్‌పోస్టుల ద్వారా నిరంతర నిఘా నిర్వహించాలని,అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు.అలాగే, తెలంగాణ ముఖ్యమంత్రి పోలీస్ పెరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్ నుండి శ్రీ కన్వెన్షన్ రింగ్ రోడ్డు గుంటూరు వరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని,అన్ని విభాగాల మధ్య సమన్వయం కలిగి పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బివి నాగ సాయికుమార్,ఇంచార్జి సౌత్ డిఎస్పీ మధుసూదన్ రావు,ఎస్బి డీఎస్పీ శ్రీనివాసులు,ట్రాఫిక్ డి.ఎస్.పి బెల్లం శ్రీనివాస రావు,ఎస్బి సీఐ అలహరి శ్రీనివాస్,నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్ ఇంటిలిజెంట్ అధికారులు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో భాగంగా నియోజకవర్గాల్లో ఎలక్ట్రోల్ మ్యాపింగ్ 14రోజుల్లో పూర్తి చేయాలి

### - తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, మార్చి 24, (,ప్రభాతవార్త) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా 95 గుంటూరు తూర్పు, 94 పశ్చిమ నియోజకవర్గాల్లో ఎలక్ట్రోల్ మ్యాపింగ్ 2 వారాల్లో పూర్తి చేయాలని,



సూపర్వైజరీ అధికారులు క్షేత్ర స్థాయిలో మ్యాపింగ్ ఖచ్చితత్వంతో వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. మంగళవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో బిఎల్ఓలు, సూపర్వైజరీ అధికారులతో ఎస్ఐఆర్ మ్యాపింగ్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ తొలుత, బిఎల్ఓల వారీగా సర్వే వివరాలు తెలుసుకొని, గుంటూరు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ 55 శాతమే అవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు. బిఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను నిర్దేశిత మార్గదర్శకాల మేరకు మ్యాపింగ్/ప్రోజేనీ పూర్తి చేయాలన్నారు. ఎస్ఐఆర్ పై ఎన్నికల సంఘం అత్యంత ప్రత్యేక దృష్టి సారించిందని, విధుల్లో అప్రమత్తంగా ఉంటూ నిర్దేశిత మార్గదర్శకాల మేరకు ప్రతి బియల్ఓ 80 శాతం మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉండే వారిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. సూపర్ వైజరీ అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో ఉండి, ఎస్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతంకు చర్యలు తీసుకోవాలని, మ్యాపింగ్ ని తాము కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తామని, ప్రతి రోజు బిఎల్ఓల వారీగా రిపోర్ట్ ఇవ్వాలని ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ ని ఆదేశించారు.సమావేశంలో గుంటూరు పశ్చిమ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఏఈఆర్ఓ సూరజ్ కుమార్, ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ బాలాజీ బాష, బిఎల్ఓలు, సూపర్వైజరీ అధికారులు పాల్గొన్నారు.

## 'పిన్నెల్లి'ని మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ సుధీర్‌భార్గవరెడ్డి

**సత్తెనపల్లి, మార్చి 24, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో పార్టీ నేతలు మర్యాదపూర్వకరంగా కలిశారు. సత్తెనపల్లి



నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పిన్నెల్లితో భేటీ అయ్యారు. కార్యక్రమం వైకాపా నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన

**యడ్లపాడు, మార్చి 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జాలాది గ్రామములో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నరేంద్ర సువర్ణ కుమారి పౌండేషన్ వారు నిర్వహించినారు. 24/03/26,ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం మార్చ్ 24న ప్రతి సంవత్సరం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించబడుతుంది. 1882లో



డాక్టర్ రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికి కారణమైన టీబి బేసిస్ ని గుర్తించడం జరిగినది. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం 2026 వ సంవత్సరం థీమ్, మనము క్షయను అంతం చేయగలము! అనేది ఒక ధైర్యమైన కార్యాచరణ పిలుపు మరియు ఆశా సందేశం. సవాలుతో కూడిన ప్రపంచ వాతావరణంలో కూడ తిరిగి గాడిలో పడి క్షయ మహమ్మారిపై పోరాట గమనాన్ని మార్చడం సాధ్యమేనని ఇది ధృవీకరిస్తుంది. క్షయ వ్యాధికి రావటానికి గల కారణాలు: క్షయ వ్యాధి అనేది. మైకో బ్యాక్టీరియం ట్యూబర్ క్లోసెస్ బ్యాక్టీరియా అనే బ్యాక్టీరియా వల్ల కలిగే అంటూ వ్యాధి. ఈ వ్యాధి సోకిన వ్యక్తి, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, గాలి ద్వారా ఇతరులకు సులభంగా వ్యాపిస్తుంది బలహీనమైన రోగ నిరోధక శక్తి తక్కువ అయినప్పుడు, రద్దీగా ఉండే ప్రదేశాలు,గాలి వెల్తురు లేని నివాసాలలోనూ ఎక్కువమంది నివసించే వారికి, సరి అయిన పోషకాహారము లేకపోవటం మరియు పొగ త్రాగటం వంటి అలవాట్లు ఈ వ్యాధి బారిన పడేలా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమమును నరేంద్ర సువర్ణ కుమారి పౌండేషన్ అధ్యక్షురాలు, ఉప అధ్యక్షుడు వై. ప్రసాదరావు వై. సుధాకర్, కె. రత్నకుమారి(ఎంఎల్ హెచ్ పి), జి.ఆష ( ఏఎన్ఎం), పి. అరుణ(ఆశ),మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఫీడ్ బ్యాక్ తీసుకొని సురుగ్గా సమాధానాలు చెప్పినవారికి గిఫ్టులు అందజేశారు.

## ఉపాధికి మార్గం ఫిన్‌టెక్ రంగం

### - యుఎస్ఏ సిటీబ్యాంక్ కన్సల్టెంట్ డా.వెంకట్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి24, ప్రభాతవార్త:** వేగంగా మారుతున్న ప్రపంచ ఫైనాన్స్‌రంగంలో ఆధునిక పోకడలు విస్తృతమౌతున్నాయని యుఎస్ఏలోని సిటీబ్యాంక్ ఫైనాన్సియల్ కన్సల్టెంట్ డా.వెంకట్ అన్నారు. వర్సిటీలోని డా.ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో రూసా 2.0 సహకారంతో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఫిన్‌టెక్ ఇన్నోవేషన్స్ అండ్ బిజినెస్ అప్లికేషన్స్ అనే అంశంపై 3రోజుల అంతర్జాతీయ సదస్సులో భాగంగా రెండవ రోజు జరిగిన ఎవల్యూషనరీ డెవలప్‌మెంట్ ఆఫ్ ఫైనాన్సియల్ టెక్నాలజీ అనే అంశంపై ప్రసంగించారు. భవిష్యత్ అంతా ఫైనాన్సియల్ టెక్నాలజీతో ముడిపడి ఉంటుందని అన్నారు. నేటితరం యువత అంతా ఫిన్‌టెక్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. భవిష్యత్‌లో ఈ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. టాంజానియా లోని డొడోమా యూనివర్సిటీ ఆచార్యులు గద్దె శ్రీనివాస్ ప్రస్తుతం ఫైనాన్స్ రంగం స్థితిగతులను వివరించారు. విట్ ఏపి యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగాధితపి ఆచార్య డి.నాగరాజు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ ఇన్ ఫైనాన్స్ అనే అంశంపై మాట్లాడుతూ ఫైనాన్స్ రంగంలో ఆధునిక పోకడలకు ఏఐ



కీలకంగా మారనుందని అన్నారు. మొత్తం నాలుగు సెషన్స్‌లో విజ్ఞాన్, వివిఐటి, కెఎల్‌యు, నల్సార్, పాండిచ్చేరి కేంద్రాయ యూనివర్సిటీల నుంచి పాల్గొన్న ఆచార్య రమేష్‌బాబు, ఆచార్య యస్.దుర్గ, ఆచార్య శివకోటి రెడ్డి, ఏఎన్‌యు నుంచి డాక్టర్ నీలిమా, ఆచార్య లలిత, డా. సూర్య కామేశ్వరిలు ప్రసంగించారు. అనంతరం సదస్సు డైరెక్టర్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ ఫైనాన్స్ రంగంలో టెక్నాలజీ పాత్రను నేటితరానికి తెలియజెప్పే ఉద్దేశ్యంతో సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎన్.ప్రసన్నకుమార్, డా. విజయవాణి, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్.జి.ఉమా, డాక్టర్ డి.రాజశేఖర్, డాక్టర్ పి. శ్యామలాదేవి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి

### -డాక్టర్ సింగరాజు సాయికృష్ణ

**సత్తెనపల్లి, మార్చి 24, ప్రభాతవార్త:** క్షయవ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని ప్రముఖ ఊపిరితిత్తులు ప్రత్యేక వైద్యనిపుణులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లిలోని సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే భారతదేశం అత్యధికంగా 25 నుండి 25 క్షయ వ్యాధి కేసులు ప్రతి సంవత్సరం నమోదవుతున్నాయని అన్నారు.సుమారు గంటకు 37 మంది చొప్పున మరియు 3 లక్షల మందికి పైన సంవత్సరానికి క్షయ వ్యాధి వలన చనిపోతున్నారు అని అన్నారు.క్షయ వ్యాధికి నూరుకు నూరు శాతం నివారించగలిగిన మందులు అందుబాటులో ఉన్నాయని, క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోని గుర్తించాలని ముఖ్యంగా షుగర్ వ్యాధిగ్రస్తులు,హెచ్ఐవి పాజిటివ్ ఉన్న వారు, వ్యాధినిరోధక శక్తి తక్కువ ఉన్నవారు ఈ వ్యాధిన బారిన పడే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని డాక్టర్



సింగరాజు సాయికృష్ణ అన్నారు.దీర్ఘకాలిక దగ్గు (2 వారాలకు పైన),కళ్ళే లో రక్తం పడుట ,జ్వరం,అలసట,ఆకలి మందగించడం,బరువు తగ్గటం, చాతిలో నొప్పి రావడం, శ్వాస తీసుకోవడం లో ఇబ్బంది రావటం మొదలగు లక్షణాలు ఉన్నవారు తక్షణమే క్షయ వ్యాధికి సంబంధించిన నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సిందిగా ఆయన సూచించారు.కేంద్ర ప్రభుత్వం క్షయ వ్యాధి నివారణ కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆర్ఎన్‌టిసిపి ప్రోగ్రాం అనేది అన్ని ప్రభుత్వ వైద్యశాల లో అందుబాటులో ఉందని దానికి తగిన క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయని అందరూ కూడా పైన పేర్కొన్న లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలానే క్షయ వ్యాధి అనేది గాలి ద్వారా ఒకరి నుండి మరొకరికి సంక్రమిస్తుంది కాబట్టి త్వరితగతిన జబ్బు నిర్ధారణ అయితే దీని యొక్క వ్యాప్తిని కూడా మనం అరికట్టవచ్చని ఆయన అన్నారు.

## నూతన విద్యార్థుల చేరికపై ప్రత్యేక దృష్టి

యడ్లపాడు, మార్చి 24, ప్రభాతవార్త : మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామంలోని ఎంపీపీస్కూల్ ఉపాధ్యాయులు "మన ఊరు మన బడి" కార్యక్రమంలో భాగంగా గ్రామంలో తిరిగి 10 మంది విద్యార్థులను 2026.27 విద్యా సంవత్సరానికి చేర్చుకున్నారు. రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పిలుపు మేరకు, ఉపాధ్యాయుల చొరవతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులు గ్రామంలోని బీసీ



క్యాచ్మెంట్ ఏరియా లోని పిల్లల కోసం తిరిగి 9 మందిని వచ్చే సంవత్సరం 1వ తరగతిలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ నజీర్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెండు రోజులు కలిపి 19 మంది విద్యార్థుల్ని పాఠశాలలో చేర్చుకున్నట్లు చేర్చుకోవటం జరిగిందని, త్వరలోనే మరి కొంతమంది చేరే అవకాశం ఉందని తెలిపారు.

## న్యూక్లియర్ మెడిసిన్ విభాగంలో స్పెక్ట్‌సిటి సౌకర్యం,హైడోస్ థెరపీ వార్డు ప్రారంభం

**మంగళగిరి, మార్చి 24, ప్రభాతవార్త :** ఎయిమ్స్ మంగళగిరిలో న్యూక్లియర్ మెడిసిన్ విభాగంలో అధునాతన స్పెక్ట్‌సిటి సౌకర్యం, హైడోస్



థెరపీ వార్డును ప్రారంభించారు.ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. అహంతేమ్ శాంతా సింగ్ చేతుల మీదుగా ఎయిమ్స్ మంగళగిరి న్యూక్లియర్ మెడిసిన్ విభాగంలో అత్యాధునిక గామా కెమెరా స్పెక్ట్‌సిటి, హైడోస్ థెరపీ వార్డును ప్రారంభించడంతో, రోగుల సంరక్షణను మెరుగుపరచడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుందన్నారు.కొత్తగా ఏర్పాటు చేసిన గామా కెమెరా స్పెక్ట్‌సిటి అనేది ఒక ఉన్నత స్థాయి డయాగ్నస్టిక్ ఇమేజింగ్ సిస్టమ్. ఇది వివిధ అవయవాల ఫంక్షనల్ ఇమేజింగ్‌ను సాధ్యం చేస్తుందని తెలిపారుఈ అత్యాధునిక సాంకేతికత 30కి పైగా రకాల స్కాన్‌ల ద్వారా వ్యాధిని ముందుగానే, కచ్చితంగా గుర్తించడంలో సహాయపడుతుందన్నారు సుమారు ..10 కోట్ల వ్యయంతో సమకూర్చుకున్న అధునాతన పరికరాలు ఉన్నప్పటికీ, ఈ సంస్థ సమానమైన ఆరోగ్య సంరక్షణను అందించడానికి దృఢంగా కట్టుబడి ఉందన్నారు.అన్ని సామాజికఆర్థిక నేపథ్యాల రోగులకు అందుబాటులో ఉండేలా, డయాగ్నస్టిక్ స్కాన్‌ల ధరను సాధారణంగా ..150 నుండి ..1500 వరకు అత్యంత సరసమైనదిగా ఉందన్నారు.దీనికి అదనంగా, ముఖ్యంగా థైరాయిడ్ క్యాన్సర్ ఉన్న రోగుల కోసం అధునాతన రేడియోన్యూక్లైడ్ థెరపీని అందించడానికి ఒక హై డోస్ థెరపీ వార్డును ప్రారంభించారు.ఈ సందర్భంగా, కార్యనిర్వాహక సంచాలకులు మాట్లాడుతూ ఈ అధునాతన సౌకర్యాల అందుబాటులో నాణ్యమైన తృతీయ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని నొక్కి చెప్పారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని వెనుకబడిన వర్గాల ప్రజల కోసం, అధునాతన రోగ నిర్ధారణ, చికిత్సలో ఉన్న అంతరాలను పూడ్చడానికి సంస్థ యొక్క నిబద్ధతను ఈ చొరవ ప్రతిబింబిస్తుందని ఆయన హైలైట్ చేశారు.ఆంధ్రప్రదేశ్, పొరుగు ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన, సరసమైన ఆరోగ్య సంరక్షణను అందించడంలో సంస్థ యొక్క నిబద్ధతను ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ఈ ప్రాంతంలో అధునాతన న్యూక్లియర్ మెడిసిన్ సేవలకు ప్రాముఖ్యతను పెంచే విషయంలో ఇది ఒక పెద్ద ముందడుగును సూచిస్తుంది అన్నారు.

## ఉపాధి హామీ పథకంలో మార్పులపై అవగాహన

**సత్తెనపల్లి, మార్చి 24, ప్రభాతవార్త:** స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకంలో వచ్చిన మార్పు (పేరు మార్పు, 100 రోజుల నుండి 125 రోజులకు పెంపుదల, పనులు గుర్తింపు, యుక్తదార ద్వారా పనుల గుర్తింపు (విబిజిఆర్ఎంజి) లో వచ్చిన పనులు, నీటి భద్రతా, నీటి సంరక్షణ, జీవనోపాధి పెంపుదల, గ్రామాలలో మౌలికవసతులు,మెదలగు అంశాలపై సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లోని 9 మండలాల ఎంపిడిఓలకు, ఎపిఒ లకు ఇసి/జెఇ లకు అలానే కూటమి నాయకులకు, అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమం లో సత్తెనపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్, కోమటినేని, శోభారాణి శ్రీనివాసరావు ,మండల పార్టీ కన్వీనర్ ఆళ్ల అమరేశ్వర రావు కొమెరపూడి, యర్రం వెంకటేశ్వరావు, రాజుపాలెం మండల కన్వీనర్ అంచుల నరసింహారావు, జన సేన,నాయకులు, భావన్నారాయణ, రాజుపాలెం, జనసేన నాయకులు, తోట నరసయ్య, 4 మండలాల కూటమి నాయకులు, వివిధ గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు. 9 మండలాల ఎంపీడీఓలు, ఎపిఒ లు ఇసి/జెఇ లు , క్లస్టర్ ఎపిడి తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రూపాయల కోసం యువకుడు పై దాడి

**పెదకూరపాడు, మార్చి24, ప్రభాతవార్త :** ముస్లిం పాలేనికి చెందిన యువకులు 1000 రూపాయల కోసం సోమవారం రాత్రి ఇద్దరి మధ్య తోపులాట జరిగింది.మంగళవారం మధ్యాహ్నం పెద్దల ప్రోత్సాహంతో మహమ్మద్ ఖాసింపై అక్రమ్ అనే యువకుడు దాడి చేశారని వారి బంధువులు పెదకూరపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు.



ఖాసింకు తలకు గాయమైందని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొంద్ది ఫిర్యాదు చేశామని తెలిపారు.ఎస్సై గిరిబాబు దర్యాప్తు చేపట్టారు.

## పింఛన్ ఇప్పించాలని ప్రమాద బాధితుని వినతి

**పెదకూరపాడు, మార్చి24, ప్రభాతవార్త :** మండలం గారపాడుకు చెందిన వేమవరపు రమేశ్ రెండేళ్ల క్రితం ప్రమాదంలో కాలు కోల్పోయి ఇబ్బంది పడుతున్నారు. తనకు వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను కలిసి విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. తక్షణమే మెడికల్ సర్టిఫికెట్‌తో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలవాలని రమేశ్‌కు సూచించారు. బాధితుడికి త్వరగా న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



25-03pg10exHMNWJQEBV 12 GNT_25-03pg10exHMNWJQEBV.qxd 24/Mar/26 11:21 PM Page 1






## సన్ రైజర్స్ జట్టులోకి కొత్త ముఖం

**హైదరాబాద్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ దగ్గర కొచ్చింది. ఈ నెల 28న ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరుగనుంది. ఈ ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌కు బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా నిలవనుంది. 10 జట్లు తమ సన్నాహకాల్లో నిమగ్నం అయ్యాయి. ప్లేయర్లందరూ తమ జట్లతో కలుస్తున్నారు. ముమ్మరంగా ప్రాక్టీస్ కొనసాగిస్తున్నారు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక మార్పు చేసింది. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ గాయం కారణంగా ఈ సీజన్‌కు దూరం కావడంతో.. అతని స్థానంలో ఇంగ్లాండ్ బౌలర్ డేవిడ్ పేయిన్‌ను జట్టులోకి తీసుకుంది. ఎడ్వర్డ్స్‌ను వేలంలో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడు కోట్ల రూపాయలకు దక్కించుకోగా.. 35 సంవత్సరాల డేవిడ్ పేయిన్‌ను అందులో సగం మొత్తానికి అంటే కోటిన్నరకు కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని ఎస్ఆర్‌హెచ్ మేనేజ్‌మెంట్ అధికారికంగా ప్రకటించింది.

ఇంగ్లండ్ లెఫ్టార్మ్ పేసర్ డేవిడ్ పేయిన్...ఇంగ్లాండ్ తరఫున ఒక వన్డే మాత్రమే ఆడాడు. టీ20 మ్యాచ్ లపై అతనికి పట్టు ఉంది. 233 టీ20 మ్యాచ్‌లలో 21.16 సగటుతో 304 వికెట్లు పడగొట్టాడు. గ్లోసెస్టర్‌షైర్‌కు టీ20 క్రికెట్‌లో టాప్ వికెట్ టేకర్ అయిన పేయిన్ 2024 టీ20 బ్లాస్ట్ టోర్నమెంట్‌లో 17 ఇన్నింగ్స్‌లలో 33 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. బిగ్ బాష్ లీగ్, ది హండ్రెడ్, ఇంటర్నేషనల్ టీ20 లీగ్, సౌతాఫ్రికా టీ20 వంటి ఫ్రాంచైజ్ క్రికెట్ లీగ్‌లో ఆడిన అనుభవం అతడికి ఉంది. ఈ క్రమంలోనే అతడిని ఆరెంజ్ ఆర్మీ జట్టులోకి తీసుకుంది.డేవిడ్ పేయిన్ కు ఇది తొలి ఐపీఎల్.భారత్‌కు తొలిసారి వస్తున్నాడు.అతడి రాకతో ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ విభాగం పటిష్టం కానుంది. ఎషాన్ మలింగ, జయదేవ్ ఉనద్కట్ తో పేయిన్ బంతిని పంచుకోనున్నాడు. కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ కూడా ఫిట్‌నెస్ సాధిస్తే ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్‌కు ఇక తిరుగులేనట్లే.



# కోహ్లీ దండయాత్రకు పరీక్ష

### టాప్ క్లాస్ బ్యాటింగ్ ○ బౌలింగ్ యావరేజ్ ○ఆర్సీబీ కప్ నిలబెట్టుకునేనా?

ఇండియన్ కాసుల క్రికెట్-ఐపీఎల్ అనగానే ముందుగా గుర్తొచ్చేది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. టాప్ త్రీ మేటి జట్లలో ఒకటి. ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీ స్టార్ డమ్.. ఆర్సీబీకి పెద్ద ప్లస్. ఐపీఎల్ ఆరంభం నుంచి స్టార్ ప్లేయర్లతో కూడిన ఆర్సీబీ భారీ అంచనాలతో బరిలోకి దిగినా స్థిరమైన ఆటతీరు లేకపోవడంతో ఐపీఎల్ కప్ కొట్టేందుకు 2025కు ఆగాల్సి వచ్చింది. ఈ సారి డిపెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతున్న ఆర్సీబీపై భారీ అంచనాలు ఉన్నాయి. రజత్ పాటిదార్ నేతృత్వంలోని ఆర్సీబీ కోర్ ప్లేయర్లతో బరిలోకి దిగుతోంది. విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్, దేవ్‌దత్ పడిక్కల్ రూపంలో బలమైన బ్యాటింగ్... భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ వంటి అనుభవజ్ఞులైన పేసర్లు ప్రధాన బలాలు.ఛాంపియన్ హోదా వల్ల వచ్చే ఒత్తిడికి తోడు కొంతమంది కీలక ఆటగాళ్ల ఫిట్ నెస్ సమస్యలు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్‌కు సవాళ్లుగా మారాయి.

(వార్త క్రీడా విభాగం)

ఆర్సీబీ.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు స్టార్ హంగులు ఉన్నాయి. ప్రతి సీజన్‌లో హాట్ ఫేవరేట్ అయిన ఆర్సీబీ గత ఏడాదే కప్ అందుకుంది. 2009, 2011, 2016లో ఫైనల్ చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎట్టకేలకు కప్ కొరత తీర్చుకున్న ఆర్సీబీ..డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతున్నది. ఈసారి కూడా టైటిల్ నిలుపుకోవాలని పట్టుదలతో ఉంది. అయితే, ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే కీలక ఆటగాళ్లు గాయాల పాలవడం ఆర్సీబీని కలవరపెడుతోంది.

#### విధ్వంసక బ్యాటర్లు

2025 విజేత జట్టులోని 17 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడం వల్ల జట్టులో ఆత్మ విశ్వాసం, అవగాహన ఎక్కువ. కింగ్ కాంగ్ విరాట్ కోహ్లీతో పాటు ఫిల్ సాల్ట్, రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్ వంటి విధ్వంసకర బ్యాటర్లు ఉన్నారు. ఓపెనర్లుగా విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్ విధ్వంసం సృష్టించడానికి సిద్ధంగా ఉన్నారు. మిడిల్ ఆర్డర్‌లో రజత్ పాటీదార్, దేవదత్ పడిక్కల్, వెంకటేష్ అయ్యర్ వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉండటం జట్టుకు కొండంత అండ. వికెట్ కీపర్ కమ్ మ్యాచ్ ఫినిషర్ జితేష్ శర్మ అందుబాటులో ఉండగా.. టీమ్ డేవిడ్, రోమారియో షెఫర్డ్ వంటి పవర్ హిట్టర్లు లోయర్ ఆర్డర్‌లో మెరుపులు మెరిపించగలరు.

బౌలింగ్‌లో ఫిట్‌నెస్ కష్టాలుబ్యాటింగ్ పరంగా ఆర్సీబీ పటిష్టంగా ఉన్నా... బౌలింగ్ విభాగం కలవరపరుస్తోంది. భువనేశ్వర్ కుమార్, జోష్ హాజిల్‌వుడ్ రూపంలో మంచి ఫేస్ అటాక్ ఉన్నా... గాయంతో హాజిల్‌వుడ్ కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. డెత్ ఓవర్ స్పెషలిస్ట్ నువాన్ తుషారా, యష్ దయాల్ వ్యక్తిగత కారణాల వల్ల జట్టుకు దూరం కావడం పెద్ద లోటు. దీంతో పేస్ విభాగం మొత్తం భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ చుట్టూ తిరుగుతోంది.

#### టాప్ స్పిన్నర్ లేని లోటు

కృనాల్ పాండ్యా, టిమ్ డేవిడ్, జాకబ్ బెతెల్, రొమారియో షెఫర్డ్ రూపంలో బెస్ట్ ఆల్‌రౌండర్లు ఆర్సీబీ సొంతం. వీరు కొంతవరకు బౌలింగ్ డిపార్ట్‌మెంట్ లోటును భర్తీ చేయగలరు. స్పెషలిస్ట్ స్పిన్నర్లు లేకపోవమే ఆర్సీబీకి లోటుగా మారింది. మిడిల్ ఓవర్లలో వికెట్లు తీయగల వరల్డ్‌క్లాస్ స్పెషలిస్ట్ స్పిన్నర్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. కృణాల్‌పాండ్యా, సుయాష్ శర్మ ఉన్నప్పటికీ, వారు ఎంతవరకు ప్రభావం చూపుతా రనేది ప్రశ్నార్థకం. దేశవాళీ సంచలనం మంగేష్ యాదవ్ పై భారీ ఆశలు ఉన్నా, ఐపీఎల్ ఒత్తిడిని అతను ఎలా తట్టుకుంటాడనేది వేచి చూడాలి.దేశీయ యువ ఆటగాళ్లకు తమ ప్రతిభ నిరూపించుకునే గొప్ప అవకాశం ఉంది. గత సీజన్ ఫామ్‌ను కొనసాగించడం, గాయాల నుంచి బయట పడి వేగంగా కోలుకోవడంపైనే విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఒత్తిడిని అధిగమించడం కీలకం. మార్చి 28న ఆరంభ మ్యాచ్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. మొత్తానికి ఆర్సీబీ బ్యాటింగ్ విభాగంలో టాప్ క్లాస్‌గా ఉన్నా, బౌలింగ్ పరంగా యావరేజ్‌గా కనిపిస్తోంది. ఈ బలహీనతలను అధిగమించి రజత్ భాటియా సేన మరోసారి మ్యాజిక్ చేస్తుందో లేదో చూడాలి.

## భారత్ టెన్నిస్ జట్టుకు సహజ, రష్మిక ఎంపిక

**హైదరాబాద్:** బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 టోర్నీలో పోటీపడే భారత మహిళల టెన్నిస్ జట్టును ప్రకటించారు. తెలంగాణకు చెందిన భారత నంబర్‌వన్ సహజ యామలపల్లి, భారత ఐదో ర్యాంకర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన ఐటీఎఫ్-100 టోర్నీలో ఫైనల్‌కు చేరి రన్నరప్‌గా నిలిచిన మహారాష్ట్ర ప్లేయర్ వైష్ణవి అడ్కర్‌కు తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కింది. 391వ ర్యాంక్‌తో సహజ భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా కొనసాగుతుండగా... వైష్ణవి 397వ ర్యాంక్‌తో రెండో ర్యాంకర్‌గా నిలిచింది. వీరితో పాటు రుతుజా భోస్లే, అంకిత రైనా కూడా భారత జట్టులో ఉన్నారు. వైదేహి చౌధరీని రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపిక చేశారు. కెప్టెన్‌గా విశాల్ ఉప్పల్, కోచ్‌గా రాధిక కనిట్కర్ ఏప్రిల్ 7 నుంచి 11వ తేదీ వరకు ఢిల్లీలో ఈ టోర్నీ జరుగుతుంది.

## రాజస్థాన్ రాయల్స్‌కు భారీ డీల్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ చరిత్రలో భారీ డీల్ కుదిరింది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని అమెరికా వ్యాపారవేత్త కల్ సోమానీ నేతృత్వంలోని కన్సార్టియం రూ.15 వేల కోట్లతో దక్కించుకున్నారు. ఇప్పటికే ఇరువర్గాల మధ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయని, 2026 ఐపీఎల్ సీజన్ తర్వాత కొత్త యజమానులకు ఈ ఫ్రాంచైజీ అప్పగించనున్నారని తెలుస్తోంది.చివరిదాకా పోటీపడిన టైమ్స్ గ్రూపకంటే ఎక్కువ ధరతో సోమానీ... రాజస్థాన్ రాయల్స్‌ను దక్కించుకున్నాడు. ఫ్రాంచైజీకి చెందిన వంద శాతం షేర్లు కొన్న సమానీ 19వ సీజన్ నుంచి రాజస్థాన్ యజమాని హోదాలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నాడు.ఈ సోమానీ.. ఇంట్రా ఎడ్జ్, ట్రుయో, ట్రుయో ఏఐ, అకాడెమియన్ సంస్థల వ్యవస్థాపకుడు. ఇక కన్సార్టియంలో అమెరికా వ్యాపారవేత్త రాబ్ వాల్టన్ కూడా ఉన్నారు. ప్రముఖ రిటైల్ సంస్థ వాల్‌మార్ట్‌కు ఆయన ఛైర్మన్‌గా వ్యవహరించారు. అగ్రరాజ్యానికే చెందిన మరో వ్యాపార కుటుంబం హాంప్ ఫ్యామిలీ కూడా ఈ గ్రూప్‌లో భాగం. కాగా.. ఫ్రాంచైజీలను అమ్మాలని రాయల్స్, ఆర్సీబీ కొంతకాలం క్రితం నిర్ణయించాయి.

## యశ్ దయాళ్‌ను ఈ సీజన్‌లో ఆడించబోం: ఆర్సీబీ

**బెంగళూరు:** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు కీలక ప్రకటన చేసింది. ఐపీఎల్2026లో తమ పేసర్ యశ్ దయాళ్ పాల్గొనడం లేదని తెలిపింది. వ్యక్తిగత కారణాల వల్ల అతడిని పక్కన పెట్టామని.. అయితే, కాంట్రాక్టు మాత్రం కొనసాగిస్తామని వెల్లడించింది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆర్సీబీ తొలిసారి ఐపీఎల్ ట్రోఫీ నెగ్గఇంది. ఆ సీజన్‌లో 13 వికెట్లు తీసి ఆర్సీబీకి కప్ అందించడంలో యశ్ దయాళ్ తన వంతు పాత్ర పోషించాడు. అనూహ్య రీతిలో యశ్ దయాళ్‌పై లైంగిక ఆరోపణలు వచ్చాయి. ఘజియాబాద్ ఎఫ్ఐఆర్ నమోదు కాగా, పోక్సో చట్టం కింద జైపూర్‌లో మరో కేసు నమోదైంది. ఐపీఎల్ 2025 సందర్భంగానూ హోటల్ గదిలో దయాళ్ తనపై అత్యాచారానికి ఒడిగట్టాడని సదరు టీనేజర్ ఆరోపించింది. కాగా యశ్ దయాళ్‌ను కొనసాగించడంపై ఆర్సీబీపై విమర్శలు రాగా.. ఆర్సీబీ క్రికెట్ డైరెక్టర్ మొ బొబాట్ తాజాగా స్పందించాడు. యశ్ ఈసారి జట్టుతో చేరడం లేదు. వ్యక్తిగతంగా అతడు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నాడు. ఇప్పటి వరకు మేము అతడికి మద్దతుగానే నిలబడ్డామన్నాడు.



## మొదటి మ్యాచ్‌లో 11 నంబర్ జర్సీలతో ఆర్సీబీ

**బెంగళూర్:** చిన్నస్వామి స్టేడియం వేదికగా మార్చి 28న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మొదటి మ్యాచ్‌లో ఆర్సీబీ ఆటగాళ్లు 11వ నంబర్ జెర్సీలు ధరించనున్నారు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ సీఈఓ రాజేశ్ మేనన్ వెల్లడించాడు. గత సంవత్సరం ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారికి నివాళిగా ఆర్సీబీ ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే స్టేడియంలో 11 సీట్లను వారికి గుర్తుగా రిజర్వ్ చేసి పెట్టారు.అంతర్జాతీయ మ్యాచ్‌లతో సహా, ఈ వేదికపై జరిగే అన్ని కార్యక్రమాల సమయంలో ఆ సీట్లు ఇకపై ఖాళీగా ఉంటాయని తెలుస్తోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగే మ్యాచ్‌కు ముందు స్టేడియం లోపల ప్రవేశ ద్వారం దగ్గర ఒక స్మారక ఫలకాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ సీజన్‌లో ఆర్సీబీ గ్రూప్ స్టేజిలో బెంగళూరులో 5, రాయ్‌పుర్‌లో 2 మ్యాచ్‌లు ఆడనుంది. గత ఏడాది ఐపీఎల్‌లో విజేతగా నిలిచిన ఆర్సీబీ జట్టుకు విజయోత్సవ సభ నిర్వహించారు.స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో పలువురు మృతిచెందారు.

# నష్టాల నుంచి స్టాక్ మార్కెట్ల రికవరీ

**ముంబయి, మార్చి 24:** స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలనుంచి మంగళవారం రికవరీ అయ్యాయి. గ్లోబల్‌సెంటిమెంట్ సానుకూలంగా మారడం, ట్రంప్ ఇరాన్‌వార్‌పై తాత్కాలిక బ్రేక్ ప్రకటించడం వంటిపరిణామాలు సూచీలను ర్యాలీ తీయించాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న విశ్వాసం ఇన్వెస్టర్లలోపెరిగింది ముడిచమురు దరలు కూడా కొంతమేర నెమ్మదించాయి. రూపాయి కూడా రికార్డు కనిష్టం నుంచి కోలుకుంది. బిఎస్ఇ సెన్సెక్స్ 1372.06పాయింట్లు పెరిగి 74,068 పాయింట్లకు చేరింది.

నిఫ్టీ 50 సూచీ కూడా 399.75 పాయింట్లు పెరిగి 22,912.40పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. ఒక్కరోజు మార్కెట్ల ర్యాలీలోనే సూచీలు ఆరు లక్షల కోట్ల రూపాయల మేర మార్కెట్ టర్నోవర్ పెరిగినట్లు అంచనా.




ఎల్అండ్‌టి 5.19శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.88శాతం,ఐసిఐసిబ్యాంకు2.38శాతంచొప్పున పెరిగాయి. బిఎస్ఇ150 మిడ్‌క్యాప్‌సూచీ 2.48 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్‌సూచీ 2.24 శాతం చొప్పున లాభపడ్డాయి. మార్కెట్ల పరంగా బిఎస్ఇలో 2968 కంపెనీలషేర్లుపెరిగితే 1295 షేర్లు క్షీణించగా 180 కంపెనీల షేర్లు మాత్రం యధాతథంగా కొనసాగాయి. ఇక స్టాక్స్ పరంగా విప్రో 0.67శాతంపెరిగింది. టిబిఒ టెక్ 3.87 శాతం, గోదావరి పవర్ అండ్ ఇస్పాత్ 4.71, కల్పతరు ప్రాజెక్టు ఇంటర్నేషనల్ 3.15 శాతం, డిసిఎక్స్ సిస్టమ్స్ 2.14శాతం, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ 3.91శాతం పెరిగాయి.కోల్ ఇడియా 2.96శాతం క్షీణిస్తే సుజ్లాన్ ఎనర్జీ 2.73శాతం, ఎస్ఇసిపి 9.89శాతం, పెరిగాయి.

ఇక యూరోప్, ఆసియా మార్కెట్లుకూడా ముందుకు సాగడం కనిపించింది. జపాన్‌నిక్కీ 225 టాపిక్స్ సూచీలు లాభాల్లో కొనసాగాయి. అమెరికా స్టాక్స్ రాత్రికిరాత్రే ర్యాలీ తీసాయి. డౌజోన్సన పార్శ్రిఆమిక సగటు 631 పాయింట్లు పెరిగింది. ఎస్అండ్‌పి 500 1.15శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 1.38శాతం పెరిగాయి.

# ఫోరెక్స్ మార్కెట్‌లో రూపీ స్వల్ప రికవరీ



**ముంబయి, మార్చి 24:** అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా రికార్డు స్థాయికి పతనమైన భారత రూపాయికి ఈరోజు స్వల్ప ఊరట లభించింది. ఇరాన్‌కు చెందిన విద్యుత్, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో రూపాయి విలువ పుంజుకుంది. సోమవారం నాటి చారిత్రాత్మక కనిష్ఠ స్థాయి నుంచి కోలుకుని, డాలర్‌తో పోలిస్తే 93.64 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ముందురోజు ట్రేడింగ్‌లో రూపాయి విలువ 0.37 శాతం క్షీణించి, డాలర్‌తో 94.12 వద్ద రికార్డు కనిష్ఠ స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే.పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు ఎగబాకడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది. భారత్ నికర దిగుమతిదారు కావడంతో అధిక ముడిచమురు ధరల వల్ల దిగుమతుల బిల్లు పెరిగిపోయి, రూపాయిపై తీవ్ర ఒత్తిడి పడుతోంది.

ట్రంప్ ప్రకటనను మార్కెట్ వర్గాలు స్వాగతించినప్పటికీ, ఈ రికవరీపై పూర్తి విశ్వాసంతో లేవని నిపుణులు చెబుతున్నారు. ఉద్రిక్తతలు తగ్గే దిశగా మరిన్ని సానుకూల సంకేతాలు వస్తేనే రూపాయి మరింత బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది మాట్లాడుతూ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన ధరలు అధికంగా ఉన్నంతకాలం రూపాయి బలహీనంగానే కొనసాగుతుందని తెలిపారు. సమీప భవిష్యత్తులో రూపాయి విలువ డాలర్‌తో 93.25 నుంచి 94.25 మధ్య బలహీనంగా ట్రేడ్ అయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఇరాన్‌తో ఫలప్రదమైన చర్చలు జరిగాయని ట్రంప్ చెప్పడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను కొంత మెరుగుపరిచింది. అయితే, ట్రంప్ ప్రకటనను ఇరాన్ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ ఖండించారు. అమెరికాతో ఎలాంటి చర్చలు జరగలేదని ఆయన స్పష్టం చేయడంతో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో రూపాయి రికవరీ ఎంతకాలం నిలుస్తుందనేది అంతర్జాతీయ పరిణామాలు, ముడిచమురు ధరల గమనంపైనే ఆధారపడి ఉంటుందని ఫోరెక్స్ మార్కెట్ నిపుణులు అంచనావేసారు.

## భీమ్ యుపిఐ కొత్త ఫీచర్




**న్యూఢిల్లీ, మార్చి 24:** యూపీఐ చెల్లింపులను మరింత సులభతరం, వేగవంతం చేసే దిశగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ముందడుగు వేసింది.ఎన్‌పీసీఐకు చెందిన ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ మంగళవారం భీమ్ పేమెంట్స్ యాప్‌లో సరికొత్త బయోమెట్రిక్ అథెంటికేషన్ ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఈ కొత్త అప్‌డేట్ ద్వారా వినియోగదారులు రూ. 5,000 వరకు జరిపే లావాదేవీలకు తమ స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర (ఫింగర్‌ప్రింట్) లేదా ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి సులభంగా ఆమోదం తెలపవచ్చు. ఈ ఫీచర్‌తో ప్రతి చిన్న లావాదేవీకి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం ఉండదు. చాలా సందర్భాల్లో పిన్ మర్చిపోవడం లేదా తప్పుగా నమోదు చేయడం వల్ల చెల్లింపులు విఫలమవుతుంటాయి.ఈ కొత్త విధానం ద్వారా అలాంటి ఇబ్బందులకు తెరపడుతుందని, చెల్లింపుల ప్రక్రియ మరింత సౌకర్యవంతంగా మారుతుందని ఎన్‌బీఎస్ఎల్ విశ్వాసం వ్యక్తం చేసింది. స్నేహితులు, కుటుంబ సభ్యులకు డబ్బు పంపడం, షాపుల్లో క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయడం,ఆన్‌లైన్ చెల్లింపులు వంటి రోజువారీ లావాదేవీలన్నింటికీ ఈ బయోమెట్రిక్ ఆప్షన్‌ను ఉపయోగించుకోవచ్చు. ఎన్‌బీఎస్ఎల్ ఎండీ, సీఈవో లలితా నటరాజ్ మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులను సులభంగా, సురక్షితంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. వినియోగదారులు వేలిముద్ర లేదా ఫేస్ అన్‌లాక్ ద్వారా లావాదేవీలను నిర్ధారించడం వల్ల పిన్‌పై ఆధారపడటంతగ్గుతుంది.చెల్లింపులు యూజర్ బయోమెట్రిక్‌తో ముడిపడి ఉండటం వల్ల బలమైన భద్రత కూడా పెరుగుతుందని ఆమె వివరించారు. బయోమెట్రిక్ డేటా వినియోగదారుడి ఫోన్‌లోనే సురక్షితంగా నిల్వ ఉండటం వల్ల పిన్ షేరింగ్ వంటి ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. భద్రత దృష్ట్యా రూ.5,000కంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు మాత్రం వినియోగదారులు తప్పనిసరిగా యూపీఐ పిన్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఇది పెద్ద మొత్తంలో జరిగే చెల్లింపులకు అదనపు రక్షణ కల్పిస్తుంది. ఫేషియల్ రికగ్నిషన్ సపోర్ట్ చేసే ఆండ్రాయిడ్, ఐఓఎస్ స్మార్ట్‌ఫోన్లలో అందుబాటులోకి వచ్చింది.

## రూ.8 వేల కోట్లకు మణిపాల్ ఐపిఒ సెబీకి డిఆర్‌హెచ్‌పి దాఖలు

**ముంబయి,మార్చి 24:** మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ ఐపిఒ జారీ కోసం ఎబీకి డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది.ఐపిఒద్వారా రూ.8 వేలకోట్లు నిధులు సమీకరించే లక్ష్యంతో ఉంది. ఇంపెరియస్ హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్స్, మణిపాల్ ఎడ్యుకేషన్, మెడికల్‌గ్రూప్ ఇండియాలు ప్రమోటర్లుగా ఉన్నారు. వీరే ఆఫర్‌ఫర్‌సేల్ పద్ధతిలో షేర్లను విక్రయించనున్నారు. మొత్తం 4.32 కోట్ల వాటాలను విక్రయించనున్నట్లు తేలింది. ఈక్విటీ షేర్లను ఎన్ఎస్ఇ, బిఎస్ఇల్లోకూడా లిస్టింగ్‌చేస్తాయి. ప్రీ ఐపిఒ ప్లేస్‌మెంట్ కిందరూ.1600 కోట్లు సమీకరించాలన్న నిర్ణయం ఉంది. కోటక్ మహీంద్రకేపిటల్; యాక్సిస్ క్యాపిటల్, గోల్డ్‌మాన్‌శాక్స్ సెక్యూరిటీస్, జెఫరీస్ ఇండియా, జెపిమోర్గాన్ ఇండియా, యుబిఎస్ సెక్యూరిటీస్ ఇండియా, డిబిఎస్‌బ్యాంక్ ఇండియాలు బుక్‌రన్నింగ్ లీడ్‌మేనేజర్లుగా ఉన్నారు. కెఫిన్‌టెక్నాలజీస్ ఇష్యూ రిజిస్ట్రార్‌గా ఉంది. తాజా ఇష్యూ ద్వారా వచ్చే 5378 కోట్లు రుణాల చెల్లింపులకు వడ్డీ చెల్లింపులకు వినియోగిస్తారు. మణిపాల్ హాస్పిటల్స్ ఇతర అనుబంధ సంస్థల బకాయిలు చెల్లించాలని నిర్ణయించారు. 574 కోట్ల రూపాయలు షహ్యాద్రి ఆసుపత్రిలో వాటా కొనుగోలుకు వినియోగిస్తారు. ఇతర మొత్తాన్ని సాధారణ పాలనాపరమైన ఖర్చులకు వినియోగిస్తారు. మణిపాల్ ఆసుపత్రి 38 ఆసుపత్రులను నిర్వహిస్తోంది. 10,761 పడకలు 14రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో విస్తరించింది. కార్యకలాపాలద్వారా 2025 ఆర్థిక సంవత్సరంలో రాబడులు 8242.2 కోట్లుగా ఉన్నాయి. గడచిన ఆరు నెలల్లో అంటే సెప్టెంబరుతో ముగిసిన ఆరునెలలకు గాను 4713.05 కోట్లుగా ఉంది. గత ఏడాది లాభాలు కూడా 1081.67 కోట్లుగా ఉంది.







## జొమాటో బాటలోనే స్విగ్గీ ప్లాట్‌ఫామ్ ఫీజు హెచ్చింపు

**ముంబయి, మార్చి 24:** ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో బాటలోనే స్విగ్గీ కూడా నడిచింది. తన ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్కో ఆర్డర్‌పై వసూలు చేసే ఈ రుసుమును రూ. 14.99 నుంచి రూ. 17.58కి పెంచింది. జీఎస్టీతో కలిపి దాదాపు 17 శాతం మేర ఛార్జీలు పెరిగాయి. పెరిగిన ఈ ఛార్జీలు స్విగ్గీ యాప్‌లో వినియోగదారులకు ఇప్పటికే కనిపిస్తున్నాయి. జొమాటో ఇప్పటికే తన ప్లాట్‌ఫామ్ ఫీజును 19 శాతం పెంచిన విషయం తెలిసిందే. దీంతో ఒక్కో ఆర్డర్‌పై రూ.2 అదనపు భారం పడింది.తాజా పెంపుతో స్విగ్గీ, జొమాటో రెండుయాప్‌లలోనూ ప్లాట్‌ఫామ్ ఫీజు జీఎస్టీతో కలిపి దాదాపు రూ.17.58కి చేరింది. ప్లాట్‌ఫామ్‌ను నిర్వహించడానికి, మెరుగైన సేవలు అందించడానికి ఈ పెంపు దోహదపడుతుందని స్విగ్గీ తమ వినియోగదారులకు తెలియజేసింది. నిర్వహణ ఖర్చులు పెరగడమే ఈ పెంపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఎల్‌పీజీ, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడంతో రెస్టారెంట్లు, డెలివరీ భాగస్వాములపై ఖర్చుల భారం ఎక్కువైంది.ఈ నేపథ్యంలోనే ఫుడ్ డెలివరీ సంస్థలు తమ మార్జిన్లను కాపాడుకోవడానికి ప్లాట్‌ఫామ్ ఫీజులను సవరిస్తున్నాయి. జొమాటో 2023 ఆగస్టులో రూ. 2తో ఈ ఫీజును ప్రారంభించి, దశలవారీగా పెంచుకుంటూ వచ్చింది. మంగళవారం ట్రేడింగ్‌లో స్విగ్గీ షేర్లు 0.33 శాతం లాభంతో రూ. 273.40 వద్ద ఫ్లాట్‌గా ట్రేడ్ అవుతున్నాయి. గత నెలలో ఈ స్టాక్ 10 శాతానికి పైగా నష్టపోయింది. మరోవైపు ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు తర్వాత జొమాటో షేర్లు 2 శాతం మేర లాభపడటం గమనార్హం.

## 30 రోజుల వ్యాలిడిటీకి మార్చాలి రాజ్యసభలో ఎంపి రాఘవ్‌ఛద్దా

**న్యూఢిల్లీ, మార్చి 24:** టెలికాం ప్లాన్‌లలో 28రోజుల ప్లాన్లవల్ల ఎక్కువ సార్లు రీఛార్జిచేయాల్సి వస్తోందని, అందుకే టెల్కోలు 30 రోజుల వాలిడిటీ ప్యాక్‌లు తీసుకురావాలని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా రాజ్యసభలో లేవనెత్తారు. టెలికాం కంపెనీలు 28 రోజుల వ్యాలిడిటీతోనే ఎక్కువగా మంత్లీ ప్లాన్స్ తీసుకొస్తుండటం వల్ల ఏడాదికి వినియోగదారులు 13 సార్లు రీఛార్జ్ చేయాల్సి వస్తోందని ప్రశ్నించారు. 28 రోజుల వ్యవధితో ఉండే ప్లాన్స్ నిలిపివేసి 30 రోజుల వ్యాలిడిటీ ప్లాన్స్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. టెలికాం ఆపరేటర్లకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.కస్టమర్లకు లబ్ధి చేకూర్చేలా వీలైనన్ని ఎక్కువ ప్లాన్లు 30 రోజుల వ్యవధితో తీసుకొచ్చేందుకు ప్లాన్ చేయాలని టెలికాం కంపెనీలకు కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి జ్యోతిరాధిత్య సిందియా స్పష్టం చేసినట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని కంపెనీలు ఒకటో, రెండో ఇలా 30 రోజుల వ్యవధితో తీసుకొచ్చినా మరిన్ని ప్లాన్స్ తీసుకురావాలని ఆదేశించారు. ఇక్కడ వన్ టైమ్ ప్లాన్, కస్టమ్ ప్లాన్, అన్ని 3 రకాల కేటగిరీల ప్లాన్స్ 30 రోజుల గడువుతో ఉండేలా తీసుకురావాలని కోరారు. ఇదే సమయంలో రాఘవ్ చద్దా డేటా పరిమితులపైనా కేంద్రాన్ని, టెలికాం కంపెనీల్ని ప్రశ్నించారు. చద్దా ప్రధానంగా వినియోగదారులు చెల్లించిన డబ్బులపై తీసుకున్న డేటా వృథా అవుతుందని ఇలా కాకుండా ఉండేందుకు 3 కొత్త డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం, టెలికాం కంపెనీల ముందు ఉంచారు. ఈ మేరకు రాజ్యసభలో వ్యాఖ్యానించారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14